


# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | శనివారం 18-04-2026 | సంపుటి - 27 | సంచిక -326 | రూ : 4 | పేజీలు: 8




30 లక్షల టన్నుల

## ఉప్పుడు బియ్యం సేకరించండి

- 5% నూకతో సరఫరాకు సిద్ధం
- పాత బకాయిలు రూ.1,468 కోట్లు విడుదల చేయండి
- కేంద్ర మంత్రి ప్రహ్లాద్‌జోషీకి తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి వినతి

దిల్లీ: యాసంగి పంటకు సంబంధించి తెలంగాణ నుంచి 30 లక్షల టన్నుల ఉప్పుడు బియ్యం సేకరించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేంద్ర ఆహార, ప్రజాపంపిణీ వ్యవహారాలశాఖ మంత్రి ప్రహ్లాద్‌జోషీకి విజ్ఞప్తి చేశారు. ఆయన శుక్రవారం రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కేంద్ర మంత్రిని దిల్లీలో కలిసి ఈ అంశంపై చర్చించారు. **తరువాయి 2లో**

ఉప్పల్ మెట్రో రైల్వే స్టేషన్‌కు

## బాంబు బెదిరింపు

- మెట్రో స్టేషన్‌లో బాంబు పెట్టినట్లు ఫోన్ చేసిన గుర్తు తెలియని వ్యక్తి
- పోలీసులకు సమాచారం అందించిన మెట్రో సిబ్బంది
- తనిఖీలు నిర్వహించగా లభ్యం



2లో



2లో

మీ ఆత్మ ప్రబోధానుసారం నడుచుకోండి

### పార్లమెంటు సభ్యులకు ప్రధాని పిలుపు


- మహిళా రిజర్వేషన్ బిల్లును ఏకగ్రీవంగా ఆమోదించాలని ఎంపీలకు ప్రధాని మోదీ పిలుపు
- లోక్‌సభ, రాష్ట్ర అసెంబ్లీలలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు బిల్లు
- ఇది యుగాలుగా మహిళలకు నిరాకరించిన హక్కు అని, వారికి న్యాయం చేయాలని వ్యాఖ్య
- డీలిమిటేషన్ వల్ల దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరగదని ప్రధాని హామీ

# ఆమెకు మళ్లీ నిరాశే

- **లోక్‌సభలో వీగిపోయిన 131వ రాజ్యాంగ సవరణ బిల్లు**
- **అనుకూలం 298.. వ్యతిరేకం 230**
- **2029 నుంచి మహిళా రిజర్వేషన్ల అమలుకు అడ్డుకట్ట**
- **22 గంటల చర్చ అనంతరం ఓటింగ్**
- **మూడింట రెండొంతుల మెజార్టీ లేకపోవడంతో వీగినట్లు ప్రకటించిన స్పీకర్**
- **తొలిసారి పార్లమెంటులో ఓడిన మోదీ సర్కారు బిల్లు**
- **డీలిమిటేషన్, కేంద్రపాలిత ప్రాంతాల చట్ట సవరణ బిల్లులు కూడా వెనక్కు తీసుకున్న కేంద్రం**
- **నేడు కేంద్ర కేబినెట్ భేటీ**
- **విపక్షాల తీరును ప్రజల్లో ఎండగట్టాలని ఎన్డీయే పక్షాల నిర్ణయం**

2లో





## హార్మూజ్ తెరిచాం

- లెబనాన్‌లో కాల్పుల విరమణ ఉన్నంత కాలమే
- ఇజ్రాయిల్‌లెబనాన్ సీజ్‌ఫైర్ నేపథ్యంలో ఇరాన్ నిర్ణయం

టెహ్రాన్ : హార్ముజ్ జలసంధిని తెరిచినట్టు ఇరాన్ గురువారం ప్రకటించింది. లెబనాన్‌లో కాల్పుల విరమణ అమల్లో వుండే పదిరోజులూ హార్మ్యూజ్‌ను పూర్తిగా తెరిచి వుంచుతామని, అన్ని వాణిజ్య నౌకల రాకపోకలను అనుమతిస్తామని ఇరాన్ విదేశాంగ మంత్రి అరగ్చి తెలిపారు. ఇరాన్ ఇస్లామిక్ **తరువాయి 2లో**



బిల్లును ఓడించి.. 2లో

## సంబరాలా!

- దేశ మహిళలు మిమ్మల్ని క్షమించరు
- విపక్షాలపై అమిత్ షా ధ్వజం

దుబాయ్ లో ఎయిర్ ట్యాక్సీలు..

## తొలి స్టేషన్ నిర్మాణం

- అందుబాటులోకి రానున్న ఎయిర్ ట్యాక్సీ సేవలు
- ట్రాఫిక్ రద్దీకి చెక్ పెట్టడమే ప్రధాన ఉద్దేశం
- 45 నిమిషాల ప్రయాణం ఇకపై 10 నిమిషాల్లోనే..!

2లో




## జాతీయ రహదారుల వెంట 'తెలుగుదనం'

- రైతు సొసైటీలకు ప్రతి జిల్లాలో ఐదెకరాలు లీజుకివ్వండి
- అక్కడ తెలుగు సంస్కృతి ఉట్టిపడేలా ఏర్పాట్లు చేస్తాం
- సీఎంకు వివరించిన సేవ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు విజయ్‌రామ్

2లో



ఇండోనేషియా అడవుల్లో

### కుప్పకూలిన హెలికాప్టర్.. 8 మంది దుర్మరణం





- టేకాఫ్ అయిన 5 నిమిషాలకే తెగిపోయిన కాంటాక్ట్
- దట్టమైన అటవీ ప్రాంతంలో శకలాల గుర్తింపు
- మృతుల్లో ఇద్దరు సిబ్బంది, ఆరుగురు ప్రయాణికులు

2లో

# హోర్ముజ్ తెరిచాం

టెహ్రాన్ : హోర్ముజ్ జలసంధిని తెరిచినట్లు ఇరాన్ గురువారం ప్రకటించింది. లెబనాన్‌లో కాల్పుల విరమణ అమల్లో వుండే పదిరోజులూ హోర్మూజ్‌ను పూర్తిగా తెరిచి వుంచుతామని, అన్ని వాణిజ్య నౌకల రాకపోకలను అనుమతిస్తామని ఇరాన్ విదేశాంగ మంత్రి అరగ్చి తెలిపారు. ఇరాన్ ఇస్లామిక్ రిపబ్లిక్ ఓడరేవులు, సముద్ర జలాల సంస్థ ఇప్పటికే ప్రకటించిన సమన్వయ మార్గంలోనే ఈ రాకపోకలు వుంటాయని అరగ్చి ట్వీట్ చేశారు.

**బలవంతంగా అంగీకరించిన ఇజ్రాయిల్**

లెబనాన్‌తో కాల్పుల విరమణకు ఇజ్రాయిల్ బలవంతంగా అంగీకరించాల్సి వచ్చిందని ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్ ప్రభుత్వ టెలివిజన్‌లో ప్రసంగిస్తూ తెలిపారు. ఇది బలమైన దౌత్యమని ఆయన వ్యాఖ్యానించారు. ఇక ఇప్పుడు హిజ్బుల్లాపై, లెబనాన్‌లో ఇతర ప్రాంతాల్లో దాడి చేసేందుకు ఇజ్రాయిల్‌కు హక్కు లేదన్నారు. ఇరాన్ ఎన్నడూ అణ్వాయుధాలను కోరుకోదని, అలాగే ఈ ప్రాంతంలో అశాంతిని లేదా ఉగ్రవాదాన్ని కూడా కోరుకోదని చెప్పారు. చట్టపరమైన పరిధుల్లో తమ ప్రాదేశిక సమగ్రతను గౌరవంతో పరిరక్షించుకుంటూనే శాంతి కోసం ఇరాన్ కృషి చేస్తోందన్నారు. ఇరాన తన సూత్రాలు, సిద్ధాంతాలు, వైఖరుల విషయంలో ధృఢంగా వుంటుందని, ఎదుటి పక్షం కూడా దాన్ని అర్థం చేసుకోవాలన్నారు. మిలటరీ కమాండర్లు, రాజకీయ నేతలు, శాస్త్రవేత్తలు, విద్యార్థులు ఇలా అందరినీ హతమార్చుకుంటూ మందుకు పోవడం ద్వారా ఇరాన్‌ను, మొత్తంగా ఈ ప్రాంతాన్ని అమెరికా, ఇజ్రాయిల్‌లు గందరగోళం, అరాచకంలోకి నెట్టేశాయని ఆయన విమర్శించారు

**పాక్‌పై ప్రశంసల జల్లు**

ఇరాన్ గౌరవాన్ని పరిరక్షిస్తూనే దౌత్యానికి సన్నద్ధమయ్యేలా సాయం చేసినందుకు పాకిస్తాన్‌కు కృతజ్ఞతలు తెలియచేశారు. కాల్పుల విరమణ ఒప్పందం కుదిరేలా మధ్యవర్తిత్వ పాత్ర పోషించిన పాక్‌ను ప్రశంసించారు. టెహరాన్‌లో చర్చల సమయంలో పాక్ ఆర్మీ చీఫ్ మునీర్‌ను పొగడ్తల్లో ముంచెత్తారు. ఇస్లామాబాద్‌లో ఇరాన ప్రతినిధి బృందానికి ఆతిధ్యమిచ్చినందుకు కృతజ్ఞతలు చెప్పారు. పొరుగు దేశాలతో స్నేహ సంబంధాలు విస్తరించుకోవాలని కోరుకుంటున్నామని చెప్పారు.

*** ఆంక్షల తర్వాత గల్ఫ్‌ను దాటిన మూడు ఇరాన్ ట్యాంకర్లు**

అమెరికా ఆంక్షలు సోమవారం అమల్లోకి వచ్చిన తర్వాత హోర్మూజ్‌ను దాటి మొదటిసారిగా మూడు ఇరాన్ చమురు ట్యాంకర్లు వచ్చాయని సముద్ర జల ట్రాకింగ్ సంస్థ కెప్లర్ తెలిపింది. మొత్తంగా 50లక్షల బ్యారెళ్ళ ముడి చమురును మోసుకుపోతున్న మూడు ట్యాంకర్లు బుధవారం హోర్మూజ్‌ను దాటి ముందుకు సాగాయి. ఈ నెల ప్రారంభంలో ఖర్గ్ ద్వీపంలో ఇవి లోడింగ్ అయ్యాయి. కెప్లర్ డేటా ప్రకారం, ముడి చమురును తీసుకెళ్ళే ఇరాన్ ట్యాంకర్ ఏదీ కూడా ఈ నెల 10 నుంచి గల్ఫ్‌ను దాటలేదు.

*** హోర్మూజ్‌పై బ్రిటన్-ఫ్రాన్స్ సమావేశం**

హోర్మూజ్‌పై చర్చించి అంతర్జాతీయ సంకీర్ణాన్ని ఏర్పాటు చేసేందుకు బ్రిటన్‌ఫ్రాన్స్‌లు వీడియో కాన్ఫరెన్స్‌ను నిర్వహిస్తున్నాయి. ఇందులో 40దేశాలు పాల్గొంటున్నాయి. బ్రిటన్ ప్రధాని స్టార్మర్, ఫ్రాన్స్ అధ్యక్షుడు మాక్రాన్‌తో భేటీ అయేందుకు ఇల్పీ ప్యాలెస్‌కు చేరుకున్నారు. హోర్మూజ్‌లో మందుపాతరలను తొలగించే కార్యక్రమాలతో సహా అన్ని అంశాలపై చర్చలు జరుగుతాయని భావిస్తున్నారు.

*** యుద్ధం తర్వాత యుద్ధం... జీవితాలు విధ్వంసం**

గత కొద్ది వారాలుగా దాడులు తర్వాత దాడులు, యుద్ధాలు కొనసాగుతుండడంతో దక్షిణ లెబనాన్‌లో ప్రజల జీవితాలు చిన్నాభిన్నమయ్యాయి. ఈ దాడుల్లో కీలక మౌలిక వసతులు కూడా నాశనమవడంతో పరిస్థితులు దారుణంగా వున్నాయి. ప్రస్తుతానికి దక్షిణ లెబనాన్‌లోని టెబ్‌నైన్ పట్టణంలో ఆస్పత్రి ఒక్కటే పనిచేస్తోంది. గత కొద్ది రోజులుగా జరిగిన పలు దాడుల్లో మెడికల్ వర్కర్లు అనేకమంది చనిపోయారు. అంబులెన్సులపై దాడులు సాగాయి. దాంతో ఈ ప్రాంతంలో వైద్య సేవలు స్తంభించాయి.

*** అమెరికా ఆయుధ సరఫరాల్లో ఆలస్యం**

ఇరాన్‌తో యుద్ధం కారణంగా దాని ప్రభావం అమెరికా నుంచి యూరప్‌కు జరిగే ఆయుధ సరఫరాపై పడింది. కొన్ని యూరప్ దేశాలకు ముందుగా ఒప్పందం కుదిరిన ఆయుధాల సరఫరాలు ఆలస్యమయ్యే అవకాశం ఉందని అమెరికా అధికారులు తెలిపారు. ఇది ప్రధానంగా ఇరాన్ యుద్ధం కొనసాగుతుండటంతో అమెరికా ఆయుధ నిల్వలు తగ్గిపోవడం కారణంగా జరుగుతోందని సమాచారం. ఈ ఆలస్యం ముఖ్యంగా బాల్టిక్ ప్రాంతం, స్కాండినేవియా దేశాలను ప్రభావితం చేస్తుందని వారు తెలిపారు. ఈ ఆయుధాలు యూరప్ దేశాలు అమెరికా ఫారిన్ మిలిటరీ సేల్స్ (ఎఫ్ఎంఎస్) ప్రోగ్రామ్ ద్వారా కొనుగోలు చేసినవే అయినప్పటికీ.. అవి ఇంకా పంపిణీ కాలేదు. ఇటీవల అమెరికా అధికారులు ద్వైపాక్షిక సందేశాల ద్వారా ఈ సరఫరాలు ఆలస్యమవుతాయని యూరప్ అధికారులకు తెలియజేశారు.

*** యూరప్ దేశాల అసంతృప్తి**

కాగా యూరప్ అధికారులు ఈ పరిస్థితిపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇది తమ రక్షణ సిద్ధతను దెబ్బతీస్తోందని ఆందోళన చెందుతున్నారు. ఎఫ్ఎంఎస్ ప్రోగ్రామ్ కింద ఆయా దేశాలు అమెరికా తయారీ ఆయుధాలను కొను గోలు చేస్తాయి. ఈ ప్రక్రియలో అమెరికా ప్రభుత్వం లాజిస్టిక్ సహాయం అందిస్తుంది. డోనాల్డ్ ట్రంప్ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో.. యూరప్ దేశాలను అమెరికా ఆయుధాలు కొనుగోలు చేయాలని ఒత్తిడి చేసింది. అయితే ఈ తరహా సరఫరాల్లో తరచుగా ఆలస్యాలు జరుగుతుండటంతో యూరప్ దేశాల్లో అసంతృప్తి పెరుగుతోంది. దీంతో కొంత మంది అధికారులు యూరప్‌లోనే తయారయ్యే ఆయుధాలపై దృష్టి పెట్టడం ప్రారంభించారు. ఇరాన్ యుద్ధానికి ముందే, అమెరికా భారీగా తన ఆయుధ నిల్వలు వినియోగించింది. ముఖ్యంగా రష్యా 2022లో ఉక్రెయిన్‌పై దాడి చేసిన తర్వాత, అలాగే గాజాలో ఇజ్రాయిల్ సైనిక చర్యలు ప్రారంభమైనత తర్వాత కూడా అమెరికా భారీగా ఆయుధాలను వినియోగించింది.

*** ఇజ్రాయిల్ దాడుల్లో 2294 మంది బలి**

లెబనాన్‌పై ఇజ్రాయిల్ జరుపుతున్న దాడులకు ప్రజలు తమ ప్రాణాలు కోల్పోతున్నారు. మార్చి 2 నుంచి జరుగుతోన్న దాడుల్లో లెబనాన్‌లో మృతుల సంఖ్య 2294కు చేరుకుంది. అలాగే 7,544మంది గాయపడ్డారు. ఈ మేరకు లెబనాన్ ఆరోగ్య మంత్రిత్వ శాఖ వివరాలు వెల్లడించింది.

*** శాశ్వత శాంతి కోసం చర్చలు**

ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు, లెబనాన్ అధ్యక్షుడు జోసెఫ్ అవోన్‌తో మంచి చర్చలు జరిగాయని ట్రంప్ చెప్పారు. వారిని వైట్ హౌజ్‌కు ఆహ్వానించి శాశ్వత శాంతి కోసం చర్చలు జరపాలని ఆయన యోచిస్తున్నట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. అమెరికా ఉపాధ్యక్షుడు జె.డి వాన్స్, విదేశాంగ మంత్రి మార్కో రూబియో, సైనిక ప్రధానాధికారి డాన్ కైనెలకు ఇజ్రాయిల్‌లెబనాన్ మధ్య శాశ్వత శాంతి సాధించేందుకు పని చేయాలని ట్రంప్ ఆదేశించినట్లు చెప్పాయి. ఇటు ఇరాన్ కూడా కాల్పుల విరమణను స్వాగతించింది. పాకిస్తాన్ మధ్యవర్తిత్వంతో ఈ ఒప్పందం కుదిరిందని వివరించింది.

## 30 లక్షల టన్నుల ఉప్పుడు బియ్యం సేకరించండి

ఢిల్లీ: యాసంగి పంటకు సంబంధించి తెలంగాణ నుంచి 30 లక్షల టన్నుల ఉప్పుడు బియ్యం సేకరించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేంద్ర ఆహార, ప్రజాపంపిణీ వ్యవహారాలశాఖ మంత్రి ప్రహ్లాద్‌జోషీకి విజ్ఞప్తి చేశారు. ఆయన శుక్రవారం రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కేంద్ర మంత్రిని ఢిల్లీలో కలిసి ఈ అంశంపై చర్చించారు. "తెలంగాణలో యాసంగి పంటలో వచ్చే ధాన్యం ఉప్పుడు బియ్యం మిల్లింగ్‌కు అనుకూలంగా ఉంటుంది. దేశవ్యాప్తంగా ఈ బియ్యానికి డిమాండ్ ఉన్నందున సరఫరా పెంచాలని ఇటీవల కేంద్ర ఆహార, ప్రజాపంపిణీ విభాగం అధికారులు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. తెలంగాణలో ఈ యాసంగి సీజన్‌లో 90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అవుతోంది. ఇందులో మొత్తం 30 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం (5% నూకతో), 5 లక్షల మెట్రిక్ టన్నుల ముడి బియ్యం (10% నూకతో) సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉన్నాం" అని రేవంత్‌రెడ్డి కేంద్ర మంత్రికి వినతిపత్రమిచ్చారు. 201415 వర్షాకాలం పంట అదనపు లెవీ సేకరణకు సంబంధించి రూ.1,468.94 కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని సీఎం కోరారు. రాష్ట్రంలో ధాన్యం సేకరించిన 48 గంటల్లోనే రైతులకు చెల్లింపులు చేస్తున్నామని, దీని కారణంగా పౌరసరఫరాలశాఖ మీద ఉన్న ఒత్తిడిని గుర్తించి వెంటనే బకాయిలు విడుదల చేయించాలని విన్నవించారు. పిల్లల్లో రక్తహీనత నివారణకు పోషకాహార బియ్యాన్ని పాఠశాలలు, వసతి గృహాలు, ఐసీడీఎస్‌లకు పంపిణీ చేయాలని కోరారు. ఇటీవలి కాలంలో నిలిపేసిన పోషక బియ్యం సరఫరాను పునఃప్రారంభించాలన్నారు. ఉప్పుడు బియ్యం సరఫరాకు సంబంధించి సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చేసిన ప్రతిపాదనలకు కేంద్రమంత్రి ప్రహ్లాద్‌జోషీ సూత్రప్రాయంగా ఆమోదం తెలిపినట్లు అధికారవర్గాలు వెల్లడించాయి. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి జితేందర్‌రెడ్డి కూడా పాల్గొన్నారు.

## జాతీయ రహదారుల వెంట 'తెలుగుదనం'

అమరావతి: "మన భూమి, మన పంట, మన వంటకు చేయూత ఇవ్వండి. రైతు సొసైటీలకు జాతీయ రహదారుల వెంట ఐదెకరాలు లీజుపై కేటాయించండి. అక్కడ 'తెలుగుదనం' పేరుతో 600 రకాల ఆంధ్ర వంటకాలను పరిచయం చేస్తాం. అమ్మమ్మ, నానమ్మల చేతివంట రుచి చూపిస్తాం' అని సేవ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు విజయ్‌రామ్ పేర్కొన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రైతుబజార్, శిల్పారామాల ఏర్పాటుతో మన వ్యవసాయం, మన సంస్కృతికి చంద్రబాబు ఎంతో చేయూత అందించారని, అదే తరహాలో 'తెలుగుదనం' వేదికల ఏర్పాటుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. సుభాష్ పాలేకర్ వ్యవసాయ విధానాల్ని అందిపుచ్చుకోవాలని తొలిసారి సూచించింది చంద్రబాబే అని పేర్కొన్నారు. చిత్తూరుకు చెందిన ప్రవాసాంధ్రురాలు ఝాన్సీలక్ష్మీబాయి, విజయ్‌రామ్ గురువారం సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి తమ ప్రతిపాదనలు వివరించారు. తెలుగుదనం వేదికలతో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల విక్రయానికి అవకాశం కల్పిస్తే రైతులకు మేలు జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా మచిలీపట్నం సమీపంలోని తరకటూరు వ్యవసాయ క్షేత్రంలో పండించిన 35 రకాల ఉత్పత్తుల్ని చంద్రబాబుకు అందజేశారు. ఈ క్షేత్రాన్ని సందర్శిస్తానని సీఎం హామీ ఇచ్చారని విజయ్‌రామ్ తెలిపారు.

## దుబాయ్ లో ఎయిర్ ట్యాక్సీలు... తొలి స్టేషన్ నిర్మాణం

దుబాయ్, ఏప్రిల్ 17: నగరంలో ట్రాఫిక్ కష్టాలకు చెక్ పెట్టి, ప్రయాణ సమయాన్ని గణనీయంగా తగ్గించే దిశగా దుబాయ్ ప్రభుత్వం తన ప్రతిష్ఠాత్మక 'ఎయిర్ ట్యాక్సీ' ప్రాజెక్టును వేగవంతం చేసింది. ఇందులో భాగంగా దుబాయ్ అంతర్జాతీయ విమానాశ్రయం సమీపంలో మొట్టమొదటి ఎయిర్ ట్యాక్సీ స్టేషన్ (వర్టిపోర్ట్) నిర్మాణం పూర్తిచేసింది. ఈ విషయాన్ని దుబాయ్ యువరాజు హమ్దాన్ బిన్ మహమ్మద్ బిన్ రషీద్ అల్ మక్తూమ్ ప్రకటించారు. 3,100 చదరపు మీటర్ల విస్తీర్ణంలో నిర్మించిన ఈ ఎయిర్ ట్యాక్సీ స్టేషన్ లో ఏటా 1,70,000 మంది ప్రయాణించడానికి వీలుగా సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు. ఈ స్టేషన్ ఈ ఏడాది చివరికి ప్రయాణికులకు అందుబాటులోకి రానుంది. ప్రస్తుతం దుబాయ్ విమానాశ్రయం నుంచి పామ్ జుమేరాకు రోడ్డు మార్గంలో వెళ్లాలంటే రద్దీని బట్టి సుమారు 45 నిమిషాల నుంచి గంట సమయం పడుతుంది. అయితే, ఈ ఎయిర్ ట్యాక్సీల ద్వారా కేవలం 10 నుంచి 12 నిమిషాల్లోనే గమ్యాన్ని చేరుకోవచ్చు. 2026 చివరి నాటికి ఈ సేవలను పూర్తిస్థాయిలో ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని దుబాయ్ రోడ్స్ అండ్ ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ లక్ష్యంగా నిర్దేశించుకుంది. మొదటి దశలో దుబాయ్ అంతర్జాతీయ విమానాశ్రయం, డౌన్‌టౌన్ దుబాయ్, దుబాయ్ మెరీనా, పామ్ జుమేరా వంటి నాలుగు కీలక ప్రాంతాల్లో ఈ వర్టిపోర్టులను నిర్మించనున్నారు. ఈ ఎయిర్ ట్యాక్సీలు పూర్తిగా విద్యుత్‌తో నడిచే వాహనాలు. హెలికాప్టర్ల తరహాలో నిలువుగా గాల్లోకి లేచి, నిలువుగా ల్యాండ్ అవుతాయి.

ఢిల్లీ : చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ కేంద్ర ప్రభుత్వం లోక్‌సభలో ప్రవేశపెట్టిన 131వ రాజ్యాంగ సవరణ బిల్లు 298 230ఓట్ల తేడాతో వీగిపోయింది. శుక్రవారం రాత్రి 7.19 గంటలకు సభలో ఓటింగ్‌కు పెట్టిన ఈ బిల్లు 2/3వంతు మెజార్టీ సాధించలేకపోయింది. సభకు హాజరై ఓటింగ్‌లో పాల్గొన్న 528 మందిలో 298 మంది అనుకూలంగా, 230 మంది వ్యతిరేకంగా ఓటేయడంతో అవసరమైన 2/3వంతు మెజార్టీ రాలేదని, అందువల్లే దానిపై తదుపరి కార్యాచరణ చేపట్టడంలేదని స్పీకర్ ఓంబిర్లా ప్రకటించారు. బిల్లు ఓడిపోవటంపై ప్రతిపక్షాలు కరతాళ ధ్వనులుచేస్తూ ఆనందం వ్యక్తంచేశాయి. మహిళలకు దక్కాల్సిన హక్కులను వారికి అందించడానికి ఇకముందు కూడా ప్రయత్నిస్తూనే ఉంటామని అధికారపక్షం ప్రకటించింది. బిల్లు పాస్‌కావడానికి సభకు హాజరై ఓటేసిన 528 మందిలో 352 మంది సభ్యుల మద్దతు అవసరం కాగా అంతకంటే 54 ఓట్లు తక్కువ రావడంతో బిల్లు వీగిపోయినట్లు స్పీకర్ ఓంబిర్లా ప్రకటించారు. ఈ తీర్పుతో 2023లో పార్లమెంటు ఆమోదించిన 106వ రాజ్యాంగ సవరణ చట్టానికి (మహిళా రిజర్వేషన్ల బిల్లు) ఢోకాలేకపోయినా అమలుకు మాత్రం అడ్డంకులు తొలగనట్లైంది. లోక్‌సభ సీట్లను 850కి పెంచి అందులో మూడోవంతు సీట్లను 2029 ఎన్నికల్లో మహిళలకు కేటాయించాలన్న లక్ష్యం నెరవేరకుండాపోయింది. తాజా పరిణామాల నేపథ్యంలో కేంద్ర కేబినెట్ శనివారం ఉదయం 11.30 గంటలకు భేటీ అవుతోంది.

**తొలిగండం గట్టెక్కినా...**

మహిళా రిజర్వేషన్లను అమల్లోకి తేవడానికి ఇప్పుడున్న 543 స్థానాలను 50 శాతంమేర పెంచి 850కి తీసుకెళ్లడానికి రాజ్యాంగంలోని ఆర్టికల్ 81ని సవరించడంతో పాటు... 2027 జనగణన వరకు ఆగకుండా 2011

## ఆమెకు మళ్లీ నిరాశే

జనాభా లెక్కల ఆధారంగానే నియోజకవర్గాల పునర్విభజన క్రతువును పూర్తిచేసేందుకు వీలుకల్పించే ఆర్టికల్ 334ఎకి సవరణలు చేస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన రాజ్యాంగ సవరణ బిల్లును, డీలిమిటేషన్ బిల్లును ప్రతిపక్షాలు తీవ్రంగా వ్యతిరేకించాయి. ఈ బిల్లుల ద్వారా కేంద్రప్రభుత్వం లోక్‌సభలో దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం తగ్గించడంతో పాటు, డీలిమిటేషన్ చట్టం ద్వారా నియోజకవర్గాలను తమ ఇష్టానుసారం మార్చుకొని 2029 ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు కుట్ర పన్నుతోందని ఆరోపించాయి. ఒకవైపు పశ్చిమబెంగాల్, తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్న తరుణంలో నియమావళిని ఉల్లంఘించి వీటిని తీసుకురావడం వెనక రాజకీయ ప్రయోజనం దాగుందని ఆరోపించాయి.

## బిల్లును ఓడించి.. సంబరాలా!

ఢిల్లీ: మహిళా రిజర్వేషన్ల బిల్లును ఓడించి విపక్షాలు సంబరాలు చేసుకోవడంపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ సంబరాలను దేశ మహిళలు గమనిస్తున్నారని, వారు ఈ ద్రోహాన్ని ఎప్పటికీ మరిచిపోరని లోక్‌సభలో బిల్లు వీగిపోయిన తర్వాత వ్యాఖ్యానించారు. అంతకుముందు దిగువ సభలో 131వ రాజ్యాంగ సవరణ, డీలిమిటేషన్, కేంద్రపాలిత ప్రాంతాల చట్ట సవరణ బిల్లులపై కొనసాగిన సుదీర్ఘ చర్చకు అమిత్ షా సమాధానం ఇచ్చారు. ఈ సందర్భంగా విపక్షాలపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మహిళలకు రిజర్వేషన్ కల్పించే బిల్లును విపక్షాలు క్రూరమైన బిల్లుగా అభివర్ణించడంపై మండిపడ్డారు. "మేం ఓటు వేయకపోతే మహిళా రిజర్వేషన్ బిల్లు ఓడిపోతుందని విపక్షాలు అంటున్నాయి. అయితే తమ తోవకు ఎవరు అడ్డుపడుతున్నారో ఈ దేశ మహిళలు గమనిస్తున్నారు. సభలో గోల చేసి విపక్షాలు తప్పించుకోవచ్చు. క్షేత్రస్థాయికి వెళ్లినపుడు మహిళల ఆక్రోశం వారికి అవగతమవుతుంది. అప్పుడు తప్పించుకోవడానికి మార్గం కూడా ఉండదు. మహిళా శక్తి అప్పుడు మీకు అర్థమవుతుంది" అని షా అన్నారు. ఉత్తరాది, దక్షిణాది రాష్ట్రాల మధ్య బిల్లు విభేదాలు తెస్తుందని విపక్షాలు చేస్తున్న వాదనలను తప్పుబట్టారు. "ఉత్తరాది.. దక్షిణాది.. ఆ ప్రాంతం.. ఈ ప్రాంతం అంటూ విభజన రాజకీయాలు చేస్తున్నారు. దేశమంతా ఒక్కటే. ఉత్తర, దక్షిణ బేధాలు చూపి దేశాన్ని ముక్కలు చేస్తామంటే కుదరదు. దక్షిణమే కాదు.. కేంద్రపాలిత ప్రాంతాలకు సైతం దేశంపై అంతే అధికారం ఉంటుంది. ప్రాంతాలకు అతీతంగా ఈ సభలోని సభ్యులందరికీ సమాన అధికారం ఉంటుంది" అని అమిత్ షా పేర్కొన్నారు. విపక్షాలు రిజర్వేషన్లకే వ్యతిరేకం కాదని.. లోక్‌సభ, రాష్ట్ర శాసనసభల్లో ఎస్సీ ఎస్టీ వర్గాలకు స్థానాలు పెరగడం కూడా ఇష్టం లేదని అన్నారు.

## ఇండోనేషియా అడవుల్లో కుప్పకూలిన హెలికాప్టర్.. 8 మంది దుర్మరణం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 17: ఇండోనేషియాలో ఘోర హెలికాప్టర్ ప్రమాదం చోటుచేసుకుంది. వెస్ట్ కాలిమంతన్ ప్రావిన్స్‌లో జరిగిన ఈ దుర్ఘటనలో హెలికాప్టర్‌లో ప్రయాణిస్తున్న ఎనిమిది మంది మృతి చెందారు. దట్టమైన అటవీ ప్రాంతంలోని కొండల మధ్య హెలికాప్టర్ శకలాలను అధికారులు గుర్తించారు.జిన్హువా వార్తా సంస్థ కథనం ప్రకారం మెలావీలోని ఒక ప్లాంటేషన్ ఏరియా నుంచి టేకాఫ్ అయిన కేవలం ఐదు నిమిషాలకే ఎయిర్‌బస్ హెచ్130 హెలికాప్టర్‌తో సంబంధాలు తెగిపోయాయి. అనంతరం గాలింపు చర్యలు చేపట్టగా, గురువారం మధ్యాహ్నం 3:25 గంటల సమయంలో ఇండోనేషియా వైమానిక దళానికి చెందిన సూపర్ ప్యూమా హెలికాప్టర్ మొదట శకలాలను గుర్తించింది. ప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదు. ప్రమాద సమయంలో హెలికాప్టర్‌లో ఇద్దరు సిబ్బంది, ఆరుగురు ప్రయాణికులు ఉన్నారు. సహాయక బృందాలు ఇప్పటివరకు నాలుగు మృతదేహాలను వెలికితీశాయి. మరో మూడు మృతదేహాలు శకలాల్లోనే చిక్కుకోగా, మరొకరి కోసం గాలింపు కొనసాగుతోంది. చీకటి పడటం, భూభాగం అత్యంత కఠినంగా ఉండటంతో సహాయక చర్యలను తాత్కాలికంగా నిలిపివేశారు. శుక్రవారం ఉదయం తిరిగి ప్రారంభిస్తామని అధికారులు తెలిపారు. రాయిటర్స్ నివేదిక ప్రకారం ఈ హెలికాప్టర్ మాథ్యూ ఎయిర్ నుసంతారాకు చెందినది. చిత్ర మహకోట అనే పామాయిల్ కంపెనీకి చెందిన ప్లాంటేషన్ ప్రాంతంలో ఈ ప్రమాదం జరిగింది.

## ఉప్పల్ మెట్రో రైలు స్టేషన్‌కు బాంబు బెదిరింపు

హైదరాబాద్, ఏప్రిల్ 17 : హైదరాబాద్ నగరంలోని ఉప్పల్ మెట్రో రైలు స్టేషన్‌కు బాంబు బెదిరింపు ఫోన్ కాల్ వచ్చింది. మెట్రో స్టేషన్‌లో బాంబు పెట్టినట్లు గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేశాడు. మెట్రో రైలు స్టేషన్ సిబ్బంది పోలీసులకు సమాచారం అందించారు. అప్రమత్తమైన పోలీసులు, బాంబు స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో అనుమానాస్పద వస్తువులు ఏవీ లభించకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. మెట్రో రైలు స్టేషన్‌లో ఎలాంటి బాంబు లభ్యం కాలేదని పోలీసులు వెల్లడించారు. ఫోన్ చేసిన నెంబర్ ఆధారంగా ఆ వ్యక్తి ఎవరో ఆరా తీసేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు.

## మీ ఆత్మ ప్రబోధానుసారం నడుచుకోండి పార్లమెంటు సభ్యులకు ప్రధాని మోదీ పిలుపు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 17: పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో మహిళా రిజర్వేషన్ బిల్లుపై ప్రధాని నరేంద్ర మోదీ భావోద్వేగంగా ప్రసంగించారు. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే ఈ చరిత్రాత్మక బిల్లును ఏకగ్రీవంగా ఆమోదించి చరిత్ర సృష్టించాలని ఆయన పార్లమెంటు సభ్యులకు విజ్ఞప్తి చేశారు. ఇది దేశంలోని సగం జనాభా అయిన మహిళలకు దక్కాల్సిన హక్కు అని, వారి శక్తికి కొత్త అవకాశాలు కల్పించాలని కోరారు. లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీలలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే 'నారీ శక్తి వందన్ అధినియమ్' అమలు కోసం ప్రభుత్వం ఈ ప్రత్యేక సమావేశాలను నిర్వహిస్తోంది. ఈ బిల్లును 2029 సార్వత్రిక ఎన్నికల నాటికి అమలు చేయడమే లక్ష్యంగా అవసరమైన రాజ్యాంగ సవరణ బిల్లులను ప్రభుత్వం ప్రవేశపెట్టింది. భవిష్యత్తులో జనాభా గణన, నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) తర్వాత ఈ రిజర్వేషన్లు అమల్లోకి వస్తాయి. ఈ సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ, "దయచేసి మీ మనస్సాక్షి చెప్పినట్టు నడుచుకోండి."

# ఎస్సీ కార్పొరేషన్ ద్వారా పాడి గేదెల పథకానికి ఆన్ లైన్ దరఖాస్తు గడువు పొడిగింపు

*** జిల్లా షెడ్యూల్డ్ కులముల సేవా సహకార అభివృద్ధి అధికారి కె.శ్రీనివాస రావు**




మహబూబాబాద్ జిల్లా, ప్రజాస్ఫూర్తి: జిల్లా షెడ్యూల్డ్ కులముల సేవా సహకార అభివృద్ధి సంఘం లి., మహబూబాబాద్ జిల్లా ద్వారా 202526 సం. నకు పాడి గేదెల పథకానికి గాను ఆన్ లైన్ దరఖాస్తు ఈనెల 16 తారీకున ముగియడంతో ప్రభుత్వం గడువు తేదీ ఈనెల 23వ తారీకు వరకు పొడిగించనైనదని జిల్లా షెడ్యూల్డ్ కులముల సేవా సహకార అభివృద్ధి అధికారి కె.శ్రీనివాస రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన షెడ్యూల్డ్ కులములకు చెందిన యువతీ / యువకులు సంబందిత కుల దృవీకరణ పత్రం (తెలంగాణా ఏర్పడిన తరవాత జారీ చేసింది), ఆదాయ ధృవీకరణ పత్రం (మీసేవ ద్వారా జారీ చేసింది). ఆధార్ కార్డు, రేషన్ కార్డు/ఫుడ్ సెక్యూరిటీ కార్డు, పాస్ పోర్ట్ సైజు పోటో, సదరం సర్టిఫికేట్ (వికలాంగుల కోసం) మరియు పట్టాదారు పాసు పుస్తకం (కనీసం 0.10 గుంటలు), దృవ పత్రాలతో ఈనెల 23వ తారీకు వరకు ఆన్ లైన్ (www.tgobmms.cgg.gov.in) నందు దరఖాస్తు చేసుకొని, వెంటనే అట్టి ఆన్లైన్ దరఖాస్తుకు సంబంధిత దృవ పత్రాలను జత పరిచి (హార్డ్ కాపీ), (గ్రామీణ ప్రాంతం వారు సంబంధిత ఎంపీడీవో కార్యాలయము నందు, పట్టణ ప్రాంతం వారు సంబంధిత మునిసిపాలిటి కార్యాలయము నందు సమర్పించాలని తెలిపారు. ఈ పథకం ద్వారా అర్హులైన లబ్ధిదారులకు (02) పాడి గేదెలను అందజేయడం జరుగుతుందని, ఈ అవకాశాన్ని అర్హులైన వారు సద్వినియోగం చేసుకోగలరని ఈ సందర్భంగా అధికారి పేర్కొన్నారు.

# మేడ్చల్ కలెక్టరేట్ వద్ద ఉద్యోగుల నిరసన ప్రదర్శన




ప్రజాస్ఫూర్తి, మేడ్చల్ జిల్లా : తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగుల జేఏసీ పిలుపు మేరకు, మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా సమీకృత జిల్లా కార్యాలయ సముదాయం వద్ద ప్రభుత్వ ఉద్యోగులు నల్ల రిబ్బన్లతో భారీ స్థాయిలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ ఛైర్మన్, తెలంగాణ నాన్ గెజెటెడ్ అధికారుల సంఘం మేడ్చల్ జిల్లా అధ్యక్షులు బి. రవి ప్రకాష్, మేడ్చల్ జిల్లా గెజెటెడ్ అధికారుల సంఘం అధ్యక్షులు వినోద్ ఆధ్వర్యంలో. మధ్యాహ్న భోజన విరామ సమయంలో మహా నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడి 29 నెలలు గడిచినా, ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై ఎలాంటి చొరవ చూపకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగుల సమస్యల విషయంలో ప్రభుత్వం నిరంతరం చిన్న చూపు చూపుతూ హామీలు అమలు చేయకుండా కాలయాపన చేస్తోందని మండిపడ్డారు. ఈ పరిస్థితుల కారణంగా ఉద్యోగుల్లో ప్రభుత్వంపై నమ్మకం పూర్తిగా దెబ్బతిన్నదని తెలిపారు. మే నెల నుంచి ఇకపై ఎలాంటి ఉపేక్ష ఉండదని, ఉద్యోగుల హక్కుల సాధన కోసం ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేయనున్నట్లు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా జిల్లా లా ఆఫీసర్ చంద్రవతి కి ఉద్యోగుల సమస్యలపై విన్నప పత్రాన్ని సమర్పించారు. ఈ నిరసన కార్యక్రమంలో రమేశ్వర్ గౌడ్, బి. వెంకటేశ్వర్లూ, సహదేవ్ గౌడ్, జైసింహ రెడ్డి, ధనయ్య, రాజు, ఆనంద్ రెడ్డి, విట్టల్, మధన్ రెడ్డి, సుధాకర్, రామకృష్ణ రెడ్డి, బి. భరత్ కుమార్, శేష సాయి గిరికాంత్, జేమ్స్ దాస్ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాలపై ప్రజలకు అవగాహన

*** ఏసీపి హుస్నాబాద్ ఎస్. సదానందం**




హుస్నాబాద్, ప్రజాస్ఫూర్తి : రోడ్డు ప్రమాదం జరిగిన మొదటి గంట (గోల్డెన్ అవర్) అత్యంత కీలకమని ఆ సమయంలో అందించే సరైన ప్రథమ చికిత్స మనిషి ప్రాణాన్ని నిలబెడుతుందని హుస్నాబాద్ ఏసీపీ, ఎస్ సదానందం పేర్కొన్నారు. 'అరైవ్ అలైవ్' కార్యక్రమంలో భాగంగా ప్రజలకు, ఆటో డ్రైవర్స్, అంబులెన్స్ డ్రైవర్లు మరియు వాలంటీర్లకు ప్రథమ చికిత్సపై హుస్నాబాద్ లోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ సదానందం మాట్లాడుతూ ప్రమాదం జరిగిన మొదటి 60 నిమిషాల్లో బాధితుడికి సరైన వైద్య సాయం అందితే ప్రాణాపాయం నుంచి తప్పించుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రమాదం జరిగినప్పుడు వెంటనే 108 కి కాల్ చేసి బాధితులను ఆసుపత్రికి తరలించాలని అంబులెన్సు వచ్చేలోగ ప్రథమ చికిత్స అందించాలని, అంబులెన్సు డ్రైవర్స్ కి కూడా ప్రాథమిక వైద్య మెళకువలు తెలిసి ఉండాలని సూచించారు. రక్తస్రావాన్ని అరికట్టడం శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది ఉంటే సి.పి.ఆర్ (సీపీఆర్) చేయడం వంటి అంశాలపై డ్రైవర్లకు వాలంటీర్లకు ప్రత్యక్షంగా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం లో హుస్నాబాద్ సిఐ, కె. శ్రీను ఎస్ఐ, పి. లక్ష్మారెడ్డి ట్రాఫిక్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా చైత్రమాసం అమావాస్య శుక్రవారం పూజలు



ప్రజాస్ఫూర్తి , షాద్నగర్ : 12వ వార్డు పెద్ద జానంపేట పోచమ్మ దేవాలయంలో చైత్రమాసం అమావాస్య శుక్రవారం పురస్కరించుకొని ఘనంగా పూజలు నిర్వహించారు. పట్టణంలోని ప్రజలందరిపై అమ్మవారి కృపాకటాక్షాలు ఎల్లవేళలా ప్రజలు సుఖశాంతులతో ఉండాలని అమ్మవారిని పట్టణ మున్సిపాలిటీ చైర్మన్ అగ్గనూరు బసవేశ్వర్ కోరారు. ముఖ్య అతిథులను సత్యనారాయణ శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో 12వ వార్డ్ కౌన్సిలర్ కళ్యాణ్ కార్ దిలీప్ కుమార్, మలగారి సత్యనారాయణ, 20 వార్డ్ కౌన్సిలర్ పిన్నమోని గోపాల్, గంద్రాతి శివయ్య, గంద్రాతి రాజయ్య, మహాదేవపూర్ మాజీ సర్పంచ్ రాజిరెడ్డి , నాయకులు ఏ అభిలాష్, జానంపేట నాయి బ్రాహ్మణ సేవా సంఘం సభ్యులు పి.సంతోష్, పి. సురేష్, వి.రవి, కృష్ణ, రమేష్, పూజారి ఉమాపతి కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

# కేపీహెచ్‌బీలో ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు దగ్ధం



కేపీహెచ్‌బీ: హైదరాబాద్‌లోని కేపీహెచ్‌బీ పరిధిలో ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు దగ్ధమైంది. అప్రమత్తమైన బస్సు సిబ్బంది వెంటనే ప్రయాణికులను కిందికి దించివేశారు. బస్సు మియాపూర్ నుంచి ఎస్ఆర్ నగర్ వైపు వెళ్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. స్థానికులు, ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీదుర్గా మహేశ్వరి ట్రావెల్స్‌కు చెందిన ఏసీ స్లీపర్ బస్సు శుక్రవారం రాత్రి మియాపూర్ నుంచి పాలకొల్లు వెళ్లేందుకు బయల్దేరింది. ఈ క్రమంలో కేపీహెచ్‌బీ సమీపంలోని పద్మావతి ప్లాజా బస్‌స్టాప్ వద్ద ఆగి ఉంది. రాత్రి 10.45 గంటల సమయంలో బస్సు డ్రైవర్ క్యాబిన్‌లో తొలుత మంటలు వచ్చాయి. వెంటనే అప్రమత్తమైన సిబ్బంది.. అందులో ఉన్న 18 మంది ప్రయాణికులను కిందికి దించివేశారు. అనంతరం మంటలు బస్సు మొత్తం వ్యాపించాయి. ఘటనాస్థలికి ట్రాఫిక్ సీఐ జానయ్య, అగ్నిమాపక సిబ్బంది చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది. ఈ ఘటనతో ఆ మార్గంలో భారీగా ట్రాఫిక్‌జామ్ అయింది.

# డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు
## త్వరగా పూర్తిచేసి లబ్ధిదారులకు అందజేయాలి

*** భువనగిరి శాసనసభ్యులు కుంభం**



భువనగిరి , ప్రజాస్ఫూర్తి : పట్టణంలోని సింగన్నగూడెం వద్ద నిర్మిస్తున్న డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం , మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులపై సమగ్ర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి హాజరై డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణ పనులు ప్రధానంగా పూర్తయ్యాయని, అయితే మౌలిక సదుపాయాల ఏర్పాట్లను, మిగిలిన పనులను త్వరగా పూర్తి చేసి, లబ్ధిదారులకు ఇళ్లను అందించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రత్యేకంగా రోడ్లు, డ్రైనేజ్ వ్యవస్థ, తాగునీటి సరఫరా, విద్యుత్ వంటి సదుపాయాలను సమగ్రంగా పూర్తి చేసి, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సూచించారు.

*** నిర్మాణంలో ఉన్న ట్యాంక్ పనులను పరిశీలించి**

పనుల నాణ్యతపై ఎలాంటి రాజీ లేకుండా, ప్రతి అంశాన్ని పర్యవేక్షిస్తూ బాధ్యతాయుతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు ప్రజలకు ఇళ్ల పంపిణీకి ముందు అన్ని సదుపాయాలు పూర్తి చేసి సిద్ధంగా ఉండేలా ముందస్తు చర్యలు తీసుకోవాలని, ఎక్కడైనా సమస్యలు ఉన్నట్లయితే వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ సమీక్షా సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు మున్సిపల్ చైర్మన్ తంగేళ్లపల్లి శ్రీవాణి రవికుమార్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ అవెజ్ సిస్తి సంబంధిత శాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు

## భావి తరాలకు స్వచ్ఛమైన గాలిని
# అందించేందుకు ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలి

*** ట్రస్మా రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్. శివరాత్రి యాదగిరి**






జగద్గిరిగుట్ట, ప్రజాస్ఫూర్తి : భావి తరాలకు స్వచ్ఛమైన గాలిని అందించేందుకు ప్రతి ఒక్కరు బాధ్యతగా మొక్కలు నాటాలని ట్రస్మా రాష్ట్ర అధ్యక్షులు, చైతన్య విద్యానికేతన్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్. శివరాత్రి యాదగిరి అన్నారు. శుక్రవారం జగద్గిరిగుట్ట డివిజన్ పరిధి, మగ్దూంనగర్ లోని చైతన్య విద్యానికేతన్ పాఠశాలలో నేచర్ వెల్ఫేర్ కౌన్సిల్ (ఎన్.డబ్ల్యూ.సి) తెలంగాణ ఆధ్వర్యంలో "వృక్షారోహణ పర్యావరణ పరిరక్షణ"పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన తోపాటు ఎన్.డబ్ల్యూ.సి చైర్మన్ జంతా రామ్ చౌదరి, వైస్ చైర్మన్ వంగాల సతీష్, డైరెక్టర్లు శివరాత్రి నిఖిల్, విజయ్ కుమార్ రెడ్డి, కలింగ శివ, డాక్టర్.ఏ.వి.లక్ష్మి లు అతిధులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పర్యావరణ రహిత సమాజాన్ని నిర్మించడంలో ప్రతిఒక్కరు భాగస్వాములు కావాలన్నారు. పెరుగుతున్న కాలుష్యాన్ని అరికట్టాలంటే మొక్కలు నాటాలన్నారు. అనంతరం పచ్చని చెట్లు ప్రగతికి మెట్లని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా తులసి, వేప, జామ, రోజా, మామిడి, మనీ ప్లాంట్, ఆక్సిజన్ ప్లాంట్లు పాఠశాల పరిసరాల్లో నాటరు. అనంతరం సదరు మొక్కలను ఉపాధ్యాయులకు, విద్యార్థులకు వారు పంపిణీ చేశారు. గ్రీన్ స్కూల్ మిషన్ లో భాగంగా త్వరలో నేపలు విద్యాసంస్థలకు విస్తరించనున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ శివరాత్రి మంగాదేవి, ప్రిన్సిపల్ శివరాత్రి సాయితేజ, ఇన్చార్జి గీత, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

# డిఫెన్సివ్ డ్రైవింగ్‌తో ప్రమాదాల నియంత్రణ సాధ్యం

**– మల్టీ జోన్–1 ఐజీపీ ఎస్. చంద్రశేఖర్ రెడ్డి**




ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: ప్రతి ఒక్కరూ డిఫెన్సివ్ డ్రైవింగ్ సూత్రాలను పాటిస్తే రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని మల్టీ జోన్-1 ఐజీపీ ఎస్. చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా నిర్వహిస్తున్న ''అరైవ్-అలైవ్''లో భాగంగా శుక్రవారం దమ్మపేట మండలంలోని వినాయక ఫంక్షన్ హాల్‌లో జరిగిన కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ అంకిత్, జిల్లా ఎస్పీ రోహిత్ రాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆటో, లారీ డ్రైవర్లు సహా వాహనదారులకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి కళ్లజోళ్లు పంపిణీ చేశారు. విద్యార్థులకు రోడ్డు భద్రత, హెల్మెట్ వినియోగంపై అవగాహన కల్పిస్తూ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. డ్రైవింగ్ లైసెన్స్ లేని 10 మందికి దమ్మపేట పోలీసులు, మోటార్ వెహికల్ ఇన్స్‌పెక్టర్ సహకారంతో లైసెన్సులు మంజూరు చేశారు. అలాగే కొండరెడ్డి గిరిజన గ్రామమైన పూసుకుంటకు చెందిన 20 మంది యువకులకు హెల్మెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఐజీపీ మాట్లాడుతూ రోడ్డు భద్రతా నియమాలను పాటించడం ప్రతి పౌరుడి బాధ్యత అని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్వంచ డీఎస్పీ సతీష్ కుమార్, అశ్వారావుపేట సీఐ నాగరాజు రెడ్డి, దమ్మపేట ఎస్సై కిషోర్ రెడ్డి, పోలీసు సిబ్బంది, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, అంగన్వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, గ్రామ రోడ్డు భద్రత కమిటీ సభ్యులు, రాజకీయ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఈనెల 22 నుంచి జరగనున్న ఆర్టీసీ సమ్మెను విజయవంతం చేయండి

*** ఎంపీ రెడ్డి ఆర్టీసీ జేఏసీ చైర్మన్**



హుస్నాబాద్ ,ప్రజాస్ఫూర్తి : తెలంగాణ ఆర్టీసీ కార్మికులు ఈనెల 22 నుండి తలపెట్టిన సమ్మెలో అధికారులు, కార్మికులు భాగస్వామ్యం కావాలని న్యాయపరమైన డిమాండ్ల సాధనకు అందరూ కలిసి రావాలని ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని యాజమాన్య బెదిరింపులకు ఆర్టీసీ కార్మికులు భయపడేది లేదని కరీంనగర్ ఉమ్మడి జిల్లా జేఏసీ చైర్మన్ ఎంపీ రెడ్డి పిలుపునిచ్చారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తే మొదట లబ్ధి పొందేది ఆర్టీసీ అధికారులేనని అదేవిధంగా అధికారులకు పే స్కేల్ జరిగితే అధికారులకు పే స్కేల్ కూడా పెరుగుతుందని అన్ని విధాలుగా మొదట లబ్ధి పొందేది అధికారులు అనే విషయాన్ని మర్చిపోవద్దని ఆయన అన్నారు. అధికారులు కార్మికులను భయభ్రాంతులకు గురిచేస్తూ ఇబ్బందులకు గురి చేయొద్దని న్యాయపరమైన డిమాండ్ల సాధనకే సమ్మె చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. భవిష్యత్తులో ఆర్టీసీ రక్షింపబడాలంటే అధికారులే ముఖ్యపాత్ర పోషించవలసి ఉంటుందని అదేవిధంగా ప్రభుత్వంలో విలీనం అయితే ఎంతోమంది తెలంగాణ నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు వస్తాయని ఆయన అన్నారు. అధికారులు కార్మికులు అనే భేదం లేకుండా అందరూ కలిసికట్టుగా ఈనెల 22న ఉదయం విధుల నుండి జరిగే సమ్మెను విజయవంతం చేసి ఆర్టీసీ అధికారుల కార్మికుల న్యాయపరమైన హక్కులను సాధించేవరకు మరియు విలీనం చేసేంతవరకు ఉద్యమం కొనసాగిస్తామని అందుకు అన్ని వర్గాల నుండి సహాయ సహకారాలు అందించి సమ్మెను విజయవంతం చేయాలని ఎంపీ రెడ్డి కోరారు ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ కే. కొమురయ్య కన్వీనర్ పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## మానవత్వం చాటుకున్న
# సుజాతనగర్ ఎస్సై రమాదేవి



ప్రజాస్ఫూర్తి, కొత్తగూడెం: గత వారం రోజుల నుంచి సుజాతనగర్ మండలం వేపలగడ్డ గ్రామంలో గుర్తు తెలియని 60 సంవత్సరాల వయస్సు గల వ్యక్తి తెల్లటి మీసాలు, గడ్డం కలిగి ఉండి తెలుపు రంగు పైజామా, ఆకుపచ్చని రంగు హాఫ్ ఫాంట్ వేసుకొని తిరుగుతూ కనిపించగా శుక్రవారం సుజాతనగర్ ఎస్ఐ రమాదేవి తన సిబ్బందితో ఆ వ్యక్తి వివరాలు తెలుసుకున్నారు. అతని పేరు తుమ్మ భాస్కరరావు, కోనాయిపాలెం గ్రామం నందిగామ మండలం, ఎన్టీఆర్ జిల్లా, ఆంధ్రప్రదేశ్ అని చెప్పగా, విచారించగా ఆ గ్రామానికి చెందినవాడు కాదని తెలిసింది. ఆ వ్యక్తిని పోలీస్ స్టేషన్‌కు తీసుకుని వచ్చి కొత్త దుస్తులు ఇప్పించి, సంరక్షణ కోసం అతనిని ఖమ్మంకు చెందిన అన్నం ఫౌండేషన్ వారికి అప్పగించారు. గుర్తు తెలియని గురించి ఎవరికైనా వివరాలు తెలిసినట్లయితే సుజాతనగర్ పోలీసు వారికి సమాచారం ఇవ్వాలని ఎస్సై రమాదేవి కోరారు.

# తెలంగాణ పై విషం చిమ్ముతున్న బీజేపీ

*** డిసిసి అధ్యక్షులు పున్న కైలాష్ నేత**

నల్లగొండ, ప్రజాస్ఫూర్తి : పార్లమెంట్లో కర్ణాటక ఎంపీ తేజస్వి సూర్య తెలంగాణ ఏర్పాటును పాకిస్తాన్ విభజనతో పోల్చాడని నిరసిస్తూ నల్గొండ డిసిసి అధ్యక్షులు పున్న కైలాష్ నేత ఆధ్వర్యంలో ఎంపీ దిష్టిబొమ్మ దహనం చేశారు. నల్గొండ పట్టణంలో క్లాక్ టవర్ వద్ద కాంగ్రెస్ నేతలు నల్ల రిబ్బన్లతో నిరసన చేపట్టి అనంతరం తేజస్వి సూర్య దిష్టి బొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా డిసిసి అధ్యక్షులు పున్న కైలాష్ నేత మాట్లాడుతూ ఆనాడు యూపీఏ చైర్మన్ సోనియా గాంధీ 4 కోట్ల ప్రజల ఆకాంక్షను నెరవేర్చిందని 60 సంవత్సరాల కలను సాకారం చేసి ప్రజాసామ్య పై గౌరవం పెంచిన దేవత అని అన్నారు. ఆంధ్రప్రదేశ్ లో కాంగ్రెస్ నష్టం పోయిన ఇచ్చిన మాట ప్రకారం తెలంగాణ ఏర్పాటును చేసిన మానవత వాది అని ఆయన కొనియాడారు. నేడు బీజేపీ తెలంగాణ పై విషం చిమ్ముతుందని అనేక మంది బలిదానాలు, పోరాటాలు, త్యాగాలను అవహేళన చేస్తున్న బిజెపి తెలంగాణలో భూస్థాపితం చేస్తామని హెచ్చరించారు. నియోజకవర్గాల పునర్ విభజనపై సీఎం రేవంత్ రెడ్డి లేవనెత్తిన వాటిపై సమాధానాలు చెప్పలేక మోడీ, అమిత్ షా కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. దక్షిణ భారతదేశం పై బిజెపి చూపిస్తున్న సవతి తల్లి ప్రేమపై రేవంత్ రెడ్డి లేవనెత్తిన అంశాలపై దేశవ్యాప్తంగా చర్చ జరుగుతుందని అన్నారు. మహిళా బిల్లు ముసుగులో బిజెపి కాంగ్రెస్ పై తప్పుడు ఆరోపణలు చేస్తూ చర్చను పక్కత్రోవ పట్టిస్తుందన్నారు. తెలంగాణ గడ్డ పై పుట్టిన బీజేపీ నేతలు నోరు మెదపటం లేదని వారు తెలంగాణ ద్రోహులన్నారు. తెలంగాణలో బిజెపి గద్దెలు కూలుతాయని హెచ్చరించారు. తేజస్వి సూర్య చేసిన వ్యాఖ్యలపై మోదీ తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సీనియర్ కాంగ్రెస్ నేతలు ఎండి ముంతాజ్ అలీ, పేరిక వెంకటేశ్వర్లు, జిల్లాపల్లి పరమేశ్, నోముల జనార్ధన్, కోమటిరెడ్డి అంజి రెడ్డి, చింతమల్ల వెంకటయ్య, వేముల గోపీనాథ్, పగుళ్ళ రాజు, చర్లపల్లి గౌతమ్, మేకల సాగర్ రెడ్డి, అంబల హరీష్, పల్లా రవి తేజ, కాటం వెంకన్న , బోడ అరుణ్, ఇందనూరి శ్రీను, పేరిక అంజయ్య, ఈధ శేఖర్, ఎండీ అజీజ్, ఎండీ ఫిరోజ్, వినీత్, సన్నీ, కౌశిక్, జశ్వంత్, శరత్ తదితరులు పాల్గొన్నారు.....

# ఈనెల 19న హిందూ సమ్మేళనం సభ జయప్రదం చేయాలి

*** సాయి నగర్ కాలనీ హిందూ సమ్మేళన సమితి పిలుపు**



ప్రజాస్ఫూర్తి, కాప్రా: ఈనెల 19వ తేదీన సాయంత్రం 5 గంటలకు కుషాయిగూడ సాయి నగర్ కాలనీ శ్రీనివాస ఎంక్లేవ్లో హిందూ సమ్మేళన సభను నిర్వహిస్తున్నట్లు (సాయి నగర్ కాలనీ, సుభాష్ నగర్ కాలనీ, కృష్ణారెడ్డి నగర్ కాలనీ పద్మావతి కాలనీ మరియు జెఆర్కె అపార్ట్మెంట్స్) హిందూ సమ్మేళన సమితి అధ్యక్ష కార్యదర్శులు మరియూ కమిటీ సభ్యులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. భారత దేశ సంస్కృతి , సంప్రదాయాల పరిరక్షణ తో పాటు హిందూ సమాజ ఐక్యతకు హిందూ సమ్మేళన సమితి కృషి చేస్తుందన్నారు. అందులో భాగంగా ఈనెల 19వ తేదీన సాయంత్రం 5 గంటలకు సాయి నగర్ కాలనీ శ్రీనివాస ఎన్క్లేవ్ లో నిర్వహిస్తున్న హిందూ సమ్మేళన సభకు సాయి దత్త పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ స్వామి రామానంద ప్రభు జి, ప్రధాన వక్తగా ప్రముఖ జర్నలిస్టు కస్తూరి రాకా సుధాకర్ గారు, వనవాసి కళ్యాణ పరిషత్ ప్రాంత ఉపాధ్యక్షురాలు మరియు వనవాసి మాసపత్రిక ఎడిటర్ శివల పద్మ ముఖ్య అతిథులుగా హాజరవుతున్నట్లు తెలిపారు. ఈ సభలో గోపూజ , కుంకుమార్చన, దేశభక్తి గీతాలు , భరతమాత పూజ ,ధార్మిక ప్రసంగాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, సమాజ ఐక్యతపై సందేశాలు ఉంటాయి అని తెలిపారు. ఆదివారం సాయంత్రం ఐదు గంటలకు జరగనున్న హిందూ సమ్మేళన సభలో హిందువులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

# ఎంపీ తేజస్వి సూర్య లోక్ సభలో కొనసాగే అర్హత లేదు

* **బిఆర్ఎస్ నాయకులు పోరాట సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బుర్ర శ్రీనివాస్ గౌడ్**



హుస్నాబాద్, ప్రజాస్ఫూర్తి. : తెలంగాణ రాష్ట్ర ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా మహారాష్ట్ర బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య మాట్లాడడం సరికాదని ఆయన ఎంపీగా లోక్ సభలో కొనసాగే అర్హత లేదని టిఆర్ఎస్ నాయకులు గౌడ జన హక్కుల పోరాట సమితి మోకు దెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బుర్ర శ్రీనివాస్ గౌడ్ అన్నారు.శుక్రవారం హుస్నాబాద్ లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణ పోరాటం గురించి అవగాహన లేని దద్దమ్మ మాటలు మాట్లాడుతున్నాడని పార్లమెంటులో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును పాకిస్తాన్ దేశ విభజనతో పోల్చిన బీజేపీ ఎంపీ తేజస్వీ సూర్య వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు మీద బీజేపీ ఎంపీ తేజస్వీ సూర్య వ్యాఖ్యలు అవివేకం అని,తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును పాకిస్తాన్ భారత్ విభజనతో పోల్చడం మూర్ఖత్వం అని ఆయన అన్నారు.తెలంగాణ ఆవిర్భావం దశాబ్దాల పోరాట ఫలితమని, తెలంగాణ సకల జనుల పోరాటం, అని ఆత్మబలిదానాల ఫలితం అని భారత రాజ్యాంగానికి లోబడి దేశ అత్యున్నత పార్లమెంట్ ఆమోదంతో తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని ఆయన తెలిపారు. దేశ పార్లమెంట్ లో తెలంగాణపై విషం చిమ్ముతుంటే తెలంగాణ ప్రజల ఓట్లతో ఎంపీలుగా ఎన్నికైన 8 మంది బీజేపీ ఎంపీలు తేజస్వీ సూర్య వ్యాఖ్యలను ఖండించకుండా ఎందుకు మౌనంగా కూర్చున్నారో తెలంగాణ ప్రజలకు సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.తెలంగాణను కించపరిచే విధంగా మాట్లాడిన తేజస్విని సూర్య తన మాటల్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని బిజెపి పార్టీ తెలంగాణ ప్రజలకు భేషరతుగా క్షమాపణ చెప్పాలని,బిజెపి ఎంపీ అలా అడ్డగోలుగా మాట్లాడుతున్నా తెలంగాణ రాష్ట్రం నుంచి ఇద్దరు కేంద్ర మంత్రులు.. కిషన్ రెడ్డి, బండి సంజయ్ , నిమ్మకు నీరెత్తినట్లు ఉండడం సిగ్గుచేటని. తేజస్వి సూర్య వ్యాఖ్యల పట్ల ప్రజలకు ఏం సమాధానం చెబుతారని కేంద్ర మంత్రులను ఆయన ప్రశ్నించారు.తెలంగాణ పట్ల అవివేకంగా మాట్లాడిన బిజెపి ఎంపీ తేజస్వి సూర్య లోక్ సభలో కొనసాగే అర్హత లేదని ఆయన అన్నారు.

## కుషాయిగూడలో భక్తిప్రపత్తులతో అన్నప్రసాద వితరణ

* **పోచమ్మ దేవాలయంలో విశేష పూజలు**




ప్రజాస్ఫూర్తి, కాప్రా : కుషాయిగూడలోని పోచమ్మ దేవాలయం భక్తుల రద్దీతో ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది. మారుతి మిత్ర మండలి ఆధ్వర్యంలో ప్రతి నెల అమావాస్య పర్వదినాన్ని పురస్కరించుకుని నిర్వహించే అన్నప్రసాద వితరణ కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం నైవేద్యాన్ని సమర్పించి భక్తులకు అన్నప్రసాదాన్ని వితరణ చేశారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ బోర్వెల్ రిగ్ సంస్థ 'ఇనాం డ్రిల్లింగ్' యజమాని కె. కార్తీక్ ముఖ్య అతిథిగా హాజరై, చిత్తుల శ్రీధర్, అమర శ్రీనివాస్ గుప్తాలతో కలిసి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో ముందుండే మారుతి మిత్ర మండలి ప్రతి నెల నిర్వహిస్తున్న ఈ అన్నదానం అభినందనీయమని పలువురు అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమంలో మారుతి మిత్ర మండలి అధ్యక్షుడు గురుమంచి అశోక్ చారి, ప్రధాన కార్యదర్శి వరుగంటి హనుమంతు, కోశాధికారి మచ్చ బాబుగౌడ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు సీతారాం రెడ్డి, సింగిరెడ్డి వెంకట్రెడ్డి, గుంటి ఆంజనేయులు యాదవ్, వికాస్ తదితరులు పాల్గొన్నారు. పరిసర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారి ప్రసాదాన్ని స్వీకరించారు.


## ఉద్యోగుల రాష్ట్రవ్యాప్త నిరసన



హైదరాబాద్: పెండింగ్ సమస్యలను పరిష్కరించనందుకు రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ ఉద్యోగులు, గెజిటెడ్ అధికారులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు శుక్రవారం తమ కార్యాలయాల వద్ద నిరసన చేపట్టారు. తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగుల ఐక్య కార్యాచరణ సమితి (టీజీఈజాక్) పిలుపులో భాగంగా.. భోజన విరామ సమయంలో ఉద్యోగులు నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. తెలంగాణ సెక్రటేరియట్ అసోసియేషన్ (టీజీఎస్ఏ) ఆధ్వర్యంలో మహా ప్రదర్శన నిర్వహించారు. ఉద్యోగుల ఐకాస ఛైర్మన్ మారం జగదీశ్వర్, సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు, సచివాలయం ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు గిరి శ్రీనివాసరెడ్డి, సచివాలయ మహిళా ఉద్యోగుల సంఘం అధ్యక్షురాలు రమాదేవి, సచివాలయ ట్రఅధికారుల సంఘం అధ్యక్షుడు జి.సురేష్‌కుమార్‌తోపాటు వందల మంది ఉద్యోగులు సచివాలయం వద్ద ర్యాలీ నిర్వహించారు. కొద్దిసేపు సచివాలయం ప్రధాన ద్వారం ముంగిట బైఠాయించి.. ప్లకార్డులతో నినాదాలు చేశారు. అనంతరం ఐకాస నేతలు హైదరాబాద్ కలెక్టరేట్, అబిడ్స్‌లోని బీమా భవన్ వద్ద జరిగిన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...నాలుగు ప్రధానాంశాలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రెండో పీఆర్‌సీని నియమించి 30 నెలలు గడుస్తున్నా నివేదిక రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే నివేదికను తెప్పించి.. 51% ఫిట్‌మెంట్‌తో జూన్ 2వ తేదీలోపు పీఆర్‌సీని అమలు చేయాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగులు, పెన్షనర్లకు పెండింగ్‌లో ఉన్న రూ.13 వేల కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలన్నారు. ఉద్యోగుల ఆరోగ్య పథకాన్ని అమల్లోకి తీసుకురావాలని కోరారు. సీపీఎస్‌ను రద్దు చేసి.. పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, 2004 సెప్టెంబరు 1వ తేదీ కంటే ముందు నోటిఫికేషన్ ద్వారా నియమితులైన ఉద్యోగులకు వెంటనే పాత పెన్షన్ వర్తింపజేయాలన్నారు. వాటితోపాటు ఇతర 64 డిమాండ్లలో పెండింగ్ అంశాలను పరిష్కరించాలని విన్నవించారు. కార్యక్రమంలో ఐకాస నేతలు బి.శ్యామ్, ముజీర్, సదానందంగౌడ్, వెంకట్, రవీందర్‌రెడ్డి, స్థితప్రజ్ఞ, కస్తూరి వెంకటేశ్వర్లు, రేండ్ల రాజేష్ తదితరులు పాల్గొన్నారు. ఉద్యోగులు, ఆర్టీసీ కార్మికుల నిరసనకు భాజపా మద్దతు: రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనలో సామాన్యులు, కార్మికులు, చివరకు ప్రభుత్వ ఉద్యోగులు కూడా రోడ్లెక్కి నిరసన తెలపాల్సిన దుస్థితి ఏర్పడిందని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. న్యాయమైన డిమాండ్ల కోసం రోడ్డెక్కిన సచివాలయ ఉద్యోగుల 'భోజన విరామ నిరసన'తోపాటు ఈ నెల 22 నుంచి ఆర్టీసీ కార్మికులు తలపెట్టిన సమ్మెకు భాజపా సంపూర్ణ మద్దతిస్తోందని ఆయన తెలిపారు. రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు సమస్యలతో సతమతమవుతుంటే.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాత్రం దిల్లీ పర్యటనలు, ప్రాంతీయ విద్వేషాలు రెచ్చగొట్టడంలో మునిగిపోయారని విమర్శించారు. కాంగ్రెస్ సర్కారు తక్షణమే సచివాలయ ఉద్యోగుల డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

## ఏరోస్పేస్ రంగానికి వ్యూహాత్మక కేంద్రంగా తెలంగాణ

: **మంత్రి శ్రీధర్‌బాబు**




హైదరాబాద్: ప్రపంచ ఏరోస్పేస్ రంగ అవసరాలకు అనుగుణంగా తెలంగాణను దేశానికి ఒక వ్యూహాత్మక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికాబద్ధంగా అడుగులు వేస్తున్నామని ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. గచ్చిబౌలిలోని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాలో శుక్రవారం ఏరోనాటికల్ సొసైటీ ఆఫ్ ఇండియా(ఏఈఎస్ఐ) హైదరాబాద్ బ్రాంచి ఆధ్వర్యంలో 'ఏరోస్పేస్ రంగంలో మారుతున్న పరిస్థితులు: పరిశోధనాభివృద్ధి, తయారీ, ధ్రువీకరణ' అంశంపై ఏర్పాటు చేసిన రెండు రోజుల జాతీయ సదస్సు ప్రారంభోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 'ప్రస్తుతం ఏరోస్పేస్ రంగంలో పరిశోధన, తయారీ, ధ్రువీకరణ(సర్టిఫికేషన్) అనే మూడు అంశాల సమన్వయం ద్వారా భారత్ ప్రపంచస్థాయి శక్తిగా ఎదుగుతోంది. ప్రపంచస్థాయి సర్టిఫికేషన్ వ్యవస్థ అభివృద్ధికి హైదరాబాద్ అనుకూలంగా ఉంది. రాబోయే 20 ఏళ్లలో 43 వేల కొత్త ఎయిర్‌క్రాఫ్ట్‌లు అవసరమని బోయింగ్, ఎయిర్‌బస్ సంస్థలు అంచనా వేశాయి. ఈ డిమాండును హైదరాబాద్ అందిపుచ్చుకునేలా ఇంజినీరింగ్, రక్షణ, ఉత్పత్తి సంస్థల నెట్‌వర్క్, ఎంఎస్ఎంఈల వ్యవస్థను బలోపేతం చేస్తున్నాం. రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు పారిశ్రామికవేత్తలు, శాస్త్రవేత్తలు ముందుకు రావాలి' అని మంత్రి పిలుపునిచ్చారు. నీతి ఆయోగ్ సభ్యుడు వి.కె.సారస్వత్ మాట్లాడుతూ.. ప్రస్తుతం సిలికాన్ ఫొటోనిక్స్ యుగం నడుస్తోందని, ఆ దిశగా హైదరాబాద్ ఎదగాలని పేర్కొన్నారు. ప్రపంచంలోనే భారత్ అతిపెద్ద దేశీయ విమానయాన మార్కెట్లలో ఒకటని, అయితే విమానాల తయారీలో ఇంకా వెనకబడే ఉన్నామని ఇస్రో మాజీ ఛైర్మన్, ఏఈఎస్ఐ ప్రెసిడెంట్ ఎలెక్ట్ డాక్టర్ ఎస్.సోమ్‌నాథ్ అన్నారు.

## తెలంగాణ ప్రజలకు బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య భేషరతుగా క్షమాపణలు చెప్పాలి

* **ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్**




మేడిపల్లి, ప్రజాస్ఫూర్తి : తెలంగాణ-ఆంధ్రప్రదేశ్ విభజనను భారత్-పాకిస్తాన్ విభజనతో పోల్చుతూ బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ అన్నారు. శుక్రవారం ఏఐఎస్ఎఫ్ మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా సమితి ఆధ్వర్యంలో ఉప్పల్ డిపో ధర్నా చౌక్ వద్ద పార్లమెంట్ లో తెలంగాణ విభజనను పాకిస్థాన్ తో పోల్చిన బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య దిష్టి బొమ్మ దగ్ధం చేయడం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలను ఆయన అత్యంత బాధ్యతారాహిత్యంగా, అవమానకరంగా, అగౌరపరుస్తూ, తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని అవమానించేలా ఉన్నవని, తెలంగాణ రాష్ట్రం అనేది దశాబ్దాల పాటు సాగిన పోరాటాలు, త్యాగాలు, ఆత్మ బలిదానాలు,ప్రజాస్వామ్య ఉద్యమాల ఫలితంగా ఏర్పడింది.అటువంటి చారిత్రక మరియు రాజ్యాంగబద్ధమైన ప్రక్రియను భారత్-పాకిస్తాన్ విభజన వంటి బాధాకరమైన మరియు హింసాత్మక ఘటనతో పోల్చడం వాస్తవాలకు విరుద్ధమే కాకుండా అత్యంత అవమానకరం అని తెలియజేశారు. తెలంగాణ నుంచి ఎన్నికైన బీజేపీ ఎంపీల మౌనం దేనికి సంకేతం అని, ఇంకా గుజరాత్ వారికి బానిసలుగా ఉంటారా? అని అడుగుతున్నామన్నారు. "తెలంగాణ గౌరవాన్ని అవమానించినప్పుడు వారికి సిగ్గు అనిపించదా? మాట్లాడే ధైర్యం కోల్పోయారా?" అని ప్రశ్నిస్తున్నాం. ఇది బీజేపీ తెలంగాణ ఉద్యమాన్ని తక్కువ చేసి చూసిన మొదటి సందర్భం కాదని ప్రజల ముందు తెలంగాణ ఏర్పాటుకు క్రెడిట్ తీసుకుంటామని చెప్పుకుంటున్న బీజేపీ నాయకులు, రాష్ట్ర గౌరవాన్ని కాపాడాల్సిన సమయంలో మాత్రం వెనకడుగు వేస్తున్నారని,కావున తేజస్వి సూర్య తక్షణమే తెలంగాణ ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలన్నారు. ఇలాంటి సందర్భాల్లో రాష్ట్రంలోని ప్రజాస్వామ్య శక్తులు, రాజకీయ పార్టీలు , ప్రజాసంఘాలు ఇలాంటి అవమానకర వ్యాఖ్యలను ఖండించి, తెలంగాణ గౌరవం , చరిత్రను రక్షించేందుకు ఐక్యంగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఎండీ అన్వర్, ఉపాధ్యక్షుడు హరీష్, కృష్ణ, శ్రీహరి, సిద్ధు, చింటూ, గోపి ,అరవింద్ ,మహేష్, ఆకాష్, విక్రమ్, ప్రవీణ్,సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు అండగా వాసవి మిత్రమండలి

* **అన్నప్రసాద వితరణ – వృద్ధులకు పింఛన్ల పంపిణీ***



ప్రజాస్ఫూర్తి, కాప్రా : సమాజ సేవలో వాసవి మిత్రమండలి మరోసారి తన ఉదారతను చాటుకుంది. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా వాసవి మిత్రమండలి ఆధ్వర్యంలో శుక్రవారం ఈసీఐఎల్ 'ఎక్స్' రోడ్డు వద్ద అమావాస్య పర్వదినాన్ని పురస్కరించుకుని అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వందలాది మందికి అన్నదానం నిర్వహించారు. అనంతరం మానవత్వమే పరమావధిగా నలుగురు పేద వృద్ధులకు ఆర్థిక సహాయం అందించారు. మాలే వరమ్మ, కొండూరి విజయ, తోడుపునూరి ఉమారాణి, పడకంటి కమలమ్మలకు నెలకు రూ.1000 చొప్పున పింఛను నగదును పంపిణీ చేశారు. కష్టకాలంలో తమను ఆదుకుంటున్న వాసవి మిత్రమండలి సభ్యులకు వృద్ధులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వాసవి మిత్రమండలి అధ్యక్షుడు పెద్ది నాగరాజు గుప్త, ప్రధాన కార్యదర్శి రెబెల్లి శ్రీనివాస్ గుప్త, కోశాధికారి రాముని తిరుమలేష్ గుప్త, కార్యనిర్వాహక కార్యదర్శి గంప కృష్ణ గుప్త పాల్గొన్నారు.అలాగే ఉపాధ్యక్షులు తాటి శ్రీనివాస్ గుప్త, చెన్న చక్రపాణి గుప్త, కార్యదర్శులు బాచెల్లి నవీన్ గుప్త, అమర కృష్ణ గుప్త, చందా సంతోష్ గుప్త, కార్యవర్గ సభ్యులు మిర్యాల అరుణ్ కుమార్ గుప్త, ఉప్పల ఆంజనేయులు గుప్త, సభ్యులు ఉప్పల శ్రీనివాసులు గుప్త, చంద్రగిరి తారకేశ్వర్ గుప్త, పెద్ది నవీన్ గుప్త, అర్థం శ్రీనివాస్ గుప్త, నంబూరు నాగేందర్ గుప్త తదితరులు పాల్గొన్నారు.

## సమ్మె విరమించిన విద్యుత్ ఆర్టిజన్లు

* **సమస్యలపై ప్రభుత్వం మానవీయ కోణంలో ఆలోచిస్తుంది: భట్టి**



హైదరాబాద్: విద్యుత్ సంస్థల్లో ఆర్టిజన్లు (తాత్కాలిక ఉద్యోగులు) శుక్రవారం సమ్మె విరమించారు. ట్రాన్స్‌కో సీఎండీ కృష్ణభాస్కర్‌తో తమ సమస్యలపై చర్చించేందుకు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆదేశించిన నేపథ్యంలో వెంటనే సమ్మె విరమించాలని నిర్ణయించినట్లు ఆర్టిజన్ల ఐక్య కార్యాచరణ సమితి (ఐకాస) జేఏసీ ఛైర్మన్ సతీశ్‌రెడ్డి ప్రకటించారు. శుక్రవారం ప్రజాభవన్‌లో ఆర్టిజన్ల ఐకాస నాయకులు డిప్యూటీ సీఎంతో సమావేశమయ్యారు. తమ సమస్యలపై సానుకూలంగా స్పందించి ఉన్నతాధికారులతో చర్చలకు అనుమతించినందుకు ఐకాస కన్వీనర్ సాయిలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా భట్టి వారితో మాట్లాడారు. ప్రజలను మెప్పించే పనులు ఉద్యోగులు చేయాలని, వేసవిలో విద్యుత్తు డిమాండ్ గరిష్ఠ స్థాయిలో ఉంటున్న నేపథ్యంలో అకస్మాత్తుగా సమ్మెకు వెళ్లడం సరైనది కాదన్నారు. చర్చల ద్వారానే సమస్యల పరిష్కారం జరుగుతుందని సూచించారు. ఆర్టిజన్ల సమస్యలపై మానవీయ కోణంలో ప్రజాప్రభుత్వం ఆలోచిస్తుందని తెలిపారు. చర్చల్లో కృష్ణభాస్కర్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, ఐకాస కోఛైర్మన్లు చంద్రారెడ్డి, శ్రీధర్‌గౌడ్, చందర్ సింగ్ ఠాకూర్, వైస్‌ఛైర్మన్ సంతోష్, కోశాధికారి ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## సెకండరీ హెల్త్ వ్యవస్థలో ప్రజలకు మెరుగైన వైద్యం అందాలి

* **కమిటీ సమావేశంలో మంత్రి దామోదర్**

హైదరాబాద్: వైద్య విధాన పరిషత్తును డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్ (డీఎస్‌హెచ్) గా మార్చిన నేపథ్యంలో.. పేదలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందేలా అధికారులు విధివిధానాలు రూపకల్పన చేయాలని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశించారు. డీఎస్‌హెచ్ విధివిధానాల రూపకల్పన కోసం శుక్రవారం కమిటీని ఏర్పాటు చేస్తూ వైద్య ఆరోగ్య శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. మంత్రి ఛైర్మన్‌గా, సభ్యులుగా ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి, వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శి, వైద్య విధాన పరిషత్తు కమిషనర్, కుటుంబ ఆరోగ్య సంక్షేమ శాఖ కమిషనర్ ఉంటారు. ప్రత్యేక ఆహ్వానితులుగా రాష్ట్ర క్యాన్సర్ కేర్ సలహాదారు డాక్టర్ నోరి దత్తాత్రేయుడు, పబ్లిక్ హెల్త్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ కె.శ్రీనాథ్‌రెడ్డిలు కమిటీలో ఉన్నారు. సచివాలయంలో మంత్రి దామోదర్ రాజనర్సింహ అధ్యక్షతన కమిటీ సమావేశం జరిగింది. మంత్రి మాట్లాడుతూ.. "రాష్ట్రంలోని అన్ని సామాజిక ఆరోగ్య కేంద్రాలు (సీహెచ్‌సీ), ఏరియా ఆసుపత్రులు, జిల్లా ఆసుపత్రులను భారతీయ ప్రజారోగ్య ప్రమాణాలకు అనుగుణంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు రూపొందించాలి. మానవ వనరులు, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, పరికరాలు, డయాగ్నస్టిక్స్, డ్రగ్స్ ప్రమాణాలకు అనుగుణంగా ఉండాలి. టీవీవీపీ పోస్టులు, వైద్య సిబ్బందిని తిరిగి నియమించే క్రమంలో ఐపీహెచ్‌ఎస్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలి. నిమ్స్, ఉస్మానియా, గాంధీ, ఎంజీఎం వంటి పెద్దాసుపత్రుల్లో చికిత్స పొంది డిశ్చార్జి అయిన పేషెంట్లకు, వారి నివాసాలకు సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ సెంటర్లలో ఫాలోప్ చికిత్స అందించేందుకు చర్యలు చేపట్టాలి"

## కోర్టు ఆదేశించినప్పటికీ భార్యకు భరణం చెల్లించకపోతే శిక్ష తప్పదు

* **జిల్లా ప్రధాన న్యాయమూర్తి**



మహబూబాబాద్ జిల్లా, ప్రజాస్ఫూర్తి: మహబూబాబాద్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ మహమ్మద్ అబ్దుల్ రఫీ శుక్రవారం సబ్ జైల్ ను సందర్శించారు. జైల్ లోని వసతులు ఖైదీ ల స్థితిగతులను పరిశీలించారు.జైల్ లోని వంటశాలను, బ్యారక్ లను తనిఖీ చేసిన న్యాయ మూర్తి ఖైదీ లకు అందుతున్న ఆహారం, వైద్య సదుపాయలపై ఆరా తీశారు. ఈ క్రమంలో కోర్టు ఆదేశాలు జారీ చేసినప్పటికీ భార్యకు భృతి చెల్లించక జైల్ శిక్ష అనుభవిస్తున్న ఖైదీ తో ముఖాముఖీ మాట్లాడారు. కోర్ట్ ఆదేశాలను అనుసరించకపోతే శిక్ష తప్పదని అన్నారు. జైలు శిక్ష అనుభవించినప్పటికీ భర్త చెల్లించాల్సిన భరణము మాఫీ చేయటం జరగదని అది తప్పకుండా చెల్లించాల్సిందేనని చట్టం చెప్తుందన్నారు. క్రమం తప్పకుండా కోర్టు వాయిదాలకు హాజరు కావాలని లేని పక్షంలో వారెంటు పై అరెస్ట్ చేస్తారని హెచ్చరించారు. ఫోక్సో, గంజాయి వంటి తీవ్రమైన నేరాలకు పాల్పడిన వారికి సాధారణంగా బెయిల్ లభించదని అన్నారు. ఈ కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ శ్రీనివాస్, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ రాజ్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## బాల్యవివాహాలను అంతం చేద్దాం


**– డీఆర్‌డీవో విద్యా చందన, డీడబ్ల్యూవో స్వర్ణలత లెనినా**




ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: బాల్య వివాహాల నిర్మూలనకై అందరూ నడుం బిగించాలని, బాల్య వివాహాలు అనేవి ఒక సామాజిక దురాచారం, అనాదిగా కొనసాగుతున్నటువంటి ఈ సాంఘిక దురాచారాన్ని అందరం కలిసి సమూలంగా నిర్మూలించాలని, బాల్య వివాహం అనేదే లేని జిల్లాకై నిరంతరం శ్రమించాలని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారిణి విద్యాచందన, జిల్లా సంక్షేమ శాఖాధికారిణి స్వర్ణలత లెనినా పిలుపునిచ్చారు. ఎయిడ్ సంస్థ వారి ఆధ్వర్యంలో జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ వారి సౌజన్యంతో బాల్య వివాహాల నిర్మూలనకై గోడ పత్రికను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో అనునిత్యం గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నామని, బాలల పరిరక్షణ విభాగం ద్వారా బాలలకు సేవలను అందిస్తున్నట్లు తెలిపారు. చిన్న వయసులోనే వివాహం చేయడం వల్ల బాలికలకు శారీరక మానసిక ఆరోగ్య రుగ్మతలు వస్తాయని సరైన పరిపక్వత లేక పుట్టే పిల్లలు కూడా అనేక రకాల లోపాలతో పుట్టడం వల్ల జీవితాంతం మనోవేదన అనుభవించాల్సి వస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో డీపీఎంలు సమ్మక్క, నర్మద, అనురాధ, ఎయిడ్ సంస్థ జిల్లా కోఆర్డినేటర్ వి రాజేష్, కమ్యూనిటీ సోషల్ మొబిలైజర్స్ మోహన్, మాన్‌సింగ్, జ్యోతి, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

## శాస్త్రీయ పద్ధతిలో బ్యారేజీల పునరుద్ధరణ

* **ఎన్డీఎస్ఏ చైర్మన్‌తో మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి భేటీ**



హైదరాబాద్: కాళేశ్వరం ఎత్తిపోతల్లోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునరుద్ధరణ పనులను పూర్తిగా శాస్త్రీయ పద్ధతిలో, పారదర్శకంగా చేపడుతున్నట్లు నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి తెలిపారు. దిల్లీలో ఆయన నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్ఏ) ఛైర్మన్ అనిల్ జైన్‌తో శుక్రవారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా బ్యారేజీల పునరుద్ధరణకు సంబంధించి ప్రభుత్వం చేపడుతున్న కార్యాచరణ ప్రణాళికపై చర్చించారు. గతంలో జరిగిన లోపాలు పునరావృతం కాకుండా ప్రభుత్వం తీసుకుంటున్న ముందు జాగ్రత్తలను వివరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. 'అన్ని కోణాల్లో నిపుణుల ఆధ్వర్యంలో చేపడుతున్న పరీక్షల తీరుపై ఎన్డీఎస్ఏ ఛైర్మన్ సంతృప్తి వ్యక్తం చేశారు. త్వరలోనే బ్యారేజీల సందర్శనకు వస్తానని ఆయన చెప్పారు. దీర్ఘకాలిక మనుగడను దృష్టిలో పెట్టుకుని పునరుద్ధరణ పనులు శాస్త్రీయ ప్రమాణాల ప్రకారం అమలు చేస్తున్నాం. రాబోయే 50 నుంచి 100 ఏళ్ల పాటు బ్యారేజీలు సురక్షితంగా భద్రంగా ఉండేలా చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. గత ప్రభుత్వ లోపాల వల్ల మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు దెబ్బతిన్నాయి. వాటిని బాగు చేయడమే మా లక్ష్యం. ఎన్డీఎస్ఏ, సీడబ్ల్యూసీ అధికారులతో సమన్వయం చేసుకుంటూ, ఐఐటీ ముంబయిలోని నిపుణుల సహకారంతో అధునాతన పరీక్షలు నిర్వహిస్తున్నాం. ఈ నెలాఖరులోగా భూసార పరీక్షలు పూర్తి చేస్తాం. వర్షాకాలం తరువాత శాశ్వత మరమ్మతులు చేపట్టాలని ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేసింది. పనుల్లో పారదర్శకత కోసం ప్రత్యేక సమన్వయ కమిటీని ఏర్పాటు చేశాం. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బ్యారేజీలను సందర్శిస్తానని ప్రకటించారు' అని మంత్రి తెలిపారు.

# దేశ రాజకీయ చిత్రపటాన్ని మార్చే ప్రయత్నం - రాహుల్ గాంధీ

ఇప్పటికే (2023లోనే) మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందిందని, దానినే అమలు చేయాలని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ (Rahul Gandhi) అన్నారు. ప్రస్తుతం ప్రతిపాదించిన బిల్లు మహిళల సాధికారత కోసం పెట్టింది కాదని విమర్శించారు. ఈ బిల్లు ముసుగులో దేశ రాజకీయ చిత్రపటాన్ని మార్చే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. అంతగా కావాలంటే పాత మహిళా రిజర్వేషన్ల బిల్లును రద్దు చేసి.. ఇప్పుడు కొత్తగా మళ్లీ తీసుకురావాలని కేంద్రానికి సూచించారు. లోక్‌సభలో 131వ రాజ్యాంగ సవరణ, డీలిమిటేషన్, కేంద్రపాలిత ప్రాంతాల చట్ట సవరణ బిల్లులపై లోక్‌సభలో చర్చ సందర్భంగా రాహుల్ ఈ వ్యాఖ్యలు చేశారు. "మహిళా బిల్లు ముసుగులో దేశ రాజకీయ చిత్రపటాన్ని మార్చే ప్రయత్నం జరుగుతోంది. అంతగా కావాలంటే పాత బిల్లును రద్దు చేసి.. మళ్లీ తీసుకురండి. మేం ఎలాంటి అభ్యంతరాలు చెప్పకుండా మద్దతిస్తాం. బీసీ, దళితులు, మైనార్టీలు, మహిళల పట్ల ఈ బిల్లు క్షమించరాని, క్రూరమైన చర్య. ఓబీసీ సోదరుల నుంచి అధికారం లాక్కునే ప్రయత్నం జరుగుతోంది. కులగణన ప్రారంభమైందని హోంమంత్రి అమిత్ షా చెప్పారు. ఇప్పుడు కులగణనతో సంబంధం




లేకుండా డీలిమిటేషన్ ఎందుకు జరుగుతోంది? విపక్షాలన్నీ దీన్ని ఓడిస్తాయి" అని రాహుల్ గాంధీ అన్నారు. "న్యాయవ్యవస్థ, ప్రైవేటు రంగం వంటి కీలక రంగాల్లో ఓబీసీలు, దళితులు ఎక్కడున్నారు? దేశ అత్యున్నత బ్యూరోక్రసీలో వీరు ఎక్కడున్నారు? ఓబీసీలకు అధికారం, భాగస్వామ్యం ఇచ్చేందుకు భాజపా సిద్ధంగా లేదు. తన ప్రాబల్యం తగ్గిపోతోందన్న భయం ఆ పార్టీకి పట్టుకుంది. దక్షిణాది, ఈశాన్య, చిన్న రాష్ట్రాలను భాజపా గౌరవించడం లేదు" అని రాహుల్ ధ్వజమెత్తారు.

**రాహుల్ క్షమాపణలు చెప్పాలి..**

లోక్‌సభలో రాహుల్ ప్రసంగిస్తూ.. ప్రధాని మోదీపై విమర్శలు గుప్పించారు. ఈ సందర్భంగా మోదీని పరోక్షంగా ఇంద్రజాలికుడంటూ రాహుల్ వ్యాఖ్యానించడం సభలో గందరగోళానికి కారణమైంది. దీనిపై స్పీకర్ ఓం బిర్లా అభ్యంతరం వ్యక్తం చేయగా.. భాజపా సభ్యులు కూడా రాహుల్ తీరుపై మండిపడ్డారు. ప్రధాన మంత్రిని అవమానిస్తున్నారని, ఇందుకు రాహుల్ వెంటనే క్షమాపణ చెప్పాలని కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, కిరణ్ రిజిజు డిమాండ్ చేశారు.

## ఒక్క ఓటరు కోసం.. అడవిలో పోలింగ్ బూత్

అహ్మదాబాద్: ప్రజాస్వామ్యంలో ప్రతి ఓటూ కీలకమే. ఒక్క ఓటుతో ఫలితం తారుమారైన ఎన్నికలూ ఉన్నాయి! అందుకే.. ఒకే ఒక్క ఓటరు ఉన్న గుజరాత్‌లోని గిర్ సోమనాథ్‌లో కూడా కేంద్ర ఎన్నికల సంఘం ప్రత్యేకంగా పోలింగ్ కేంద్రం (Polling Booth) ఏర్పాటు చేస్తోంది. ఆ ఒక్క ఓటరు కోసం అధికారులు, సిబ్బందిని 20కిలోమీటర్ల దూరంలోని మారుమూల ప్రాంతానికి పంపుతోంది. ఇందులో భాగంగా ప్రిసైడింగ్ అధికారి, సిబ్బంది, పోలీసు సిబ్బంది పోలింగ్‌కు ఒక రోజు ముందుగానే అటవీ ప్రాంతానికి చేరుకుని రాత్రంతా అక్కడే ఉంటారు. మహంత్ హరిదాస్ బాపు ఓటు హక్కును వినియోగించుకున్నాకే వీరంతా అక్కడి నుంచి తిరుగు ప్రయాణమవుతారు. గతంలో బనేజ్ ప్రాంతానికి చెందిన మహంత్ భరత్ దాస్ బాపు తన ఓటుహక్కు వినియోగించుకునేందుకు ప్రతి ఎన్నికల్లోనూ గిర్ సోమనాథ్‌లోని పోలింగ్



కేంద్రానికి వచ్చేవారు. బనేజ్ ప్రాంతంలోని ఓ శివాలయం వద్ద నివసించేది ఆయన ఒక్కరే కావడంతో ఈసీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. 2019లో ఆయన మరణించిన తర్వాత ఆ పోలింగ్ బూత్‌ను మూసివేయాలనుకున్నారు. అయితే, ఆయన శిష్యుడిగా మహంత్ హరిదాస్ బాపు రావడంతో.. ఆ పోలింగ్ బూత్‌ను కొనసాగిస్తున్నారు. గుజరాత్‌లో స్థానిక సంస్థల ఎన్నికల పోలింగ్ ఏప్రిల్ 26న జరగనుండగా.. ఓట్ల లెక్కింపు ఏప్రిల్ 28న చేపట్టనున్నారు.


## గంజాయితో పట్టుబడ్డ ఎయిరిండియా కోపైలట్.. వెనక్కి పంపిన అమెరికా

న్యూఢిల్లీ/శాన్‌ఫ్రాన్సిస్కో, ఏప్రిల్ 17 : ఎయిరిండియా కోపైలట్ ఒకరు శాన్‌ఫ్రాన్సిస్కో విమానాశ్రయంలో గంజాయితో పట్టుబడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మంగళవారం అతడు 'స్టాఫ్ ఆన్ డ్యూటీ' కింద ప్యాసింజర్ క్యాబిన్‌లో దిల్లీ నుంచి శాన్‌ఫ్రాన్సిస్కో వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో అతడు విమానాన్ని నడపాల్సి ఉంది. ఈ క్రమంలో శాన్‌ఫ్రాన్సిస్కోలో అధికారులు చేసిన తనిఖీల్లో కోపైలట్ బ్యాగ్‌లో గంజాయి బయటపడింది. దీంతో వారు ఎయిరిండియాకు సమాచారం అందించారు. అనంతరం అమెరికా అధికారులు కోపైలట్‌ను వేరే విమానంలో భారత్‌కు పంపించారు. ఏప్రిల్ 14న జరిగిన ఈ ఘటనపై డీజీసీఏకు ఎయిరిండియా ఫిర్యాదు చేసింది. ఈ విషయాన్ని ఎయిరిండియా సోషల్ మీడియా వేదికగా వెల్లడించింది. చట్ట ఉల్లంఘనలను తాము ఏమాత్రం ఉపేక్షించబోమని పేర్కొంది. కంపెనీ నిబంధనల ప్రకారం సదరు కోపైలట్‌పై క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని తెలిపింది. గతంలోనూ ఎయిరిండియాకు చెందిన ఓ పైలట్ ఇదే విధంగా నిబంధనలు ఉల్లంఘించి అధికారులకు పట్టుబడ్డారు. డిసెంబర్ 2025లో వాంకోవర్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి దిల్లీ వెళ్లాల్సిన విమానానికి చెందిన ఎయిర్ ఇండియా కెప్టెన్ రెండు బ్రీత్ అనలైజర్ పరీక్షల్లో విఫలమయ్యారు. దీంతో కెనడా అధికారులు అతడిని అదుపులోకి తీసుకున్నారు.




## అంతర్గత విషయాల్లో జోక్యం చేసుకోవద్దు : పాక్‌కు భారత్ హెచ్చరిక

న్యూఢిల్లీ, ఏప్రిల్ 17: భారత అంతర్గత వ్యవహారాల్లో బయటివారు జోక్యం చేసుకోవద్దని విదేశాంగ మంత్రిత్వ శాఖ పాకిస్థాన్‌ను హెచ్చరించింది. డీలిమిటేషన్ బిల్లు పై పాకిస్థాన్ చేసిన వ్యాఖ్యలను తోసిపుచ్చింది. దేశానికి సంబంధించిన అంతర్గత విషయాల్లో చొరబడేందుకు చేసే యత్నాలను భారత్ ఎన్నటికీ సహించబోదని విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జయస్వాల్ పేర్కొన్నారు. దేశంలోని పరిపాలనా, శాసనపరమైన ప్రక్రియలకు సంబంధించిన నిర్ణయాలు సార్వభౌమత్వానికి సంబంధించిన విషయాలని.. వీటిలో ఇతర దేశాల జోక్యాన్ని సహించబోమన్నారు. పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే)లో నియోజకవర్గాల పునర్విభజన



చేపట్టేందుకు ఎన్నికల సంఘానికి అధికారం కల్పించే ఒక నిబంధన డీలిమిటేషన్ బిల్లు 2026లో ఉంది. ఈ నిబంధనపై పాకిస్థాన్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. భారత్ ప్రవేశపెట్టిన ఈ డీలిమిటేషన్ బిల్లును వ్యతిరేకిస్తున్నట్లు పాక్ విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి తాహిర్ అంద్రాబీ పేర్కొన్నారు

## భారత్‌లో నెలవారీ సంపాదన.. ఆస్ట్రేలియాలో ఒక్క రోజులో: భారతీయుడి వీడియో వైరల్


మెల్‌బోర్న్ (ఆస్ట్రేలియా) : మెరుగైన జీవనశైలి, ఉద్యోగం, ఎక్కువ జీతం కోసం అనేకమంది భారతీయులు విదేశాలకు తరలిపోతూ ఉంటారు. అలా ఆస్ట్రేలియాకు వెళ్లిన ఓ భారతీయుడు పెట్టిన పోస్టు సామాజిక మాధ్యమాల్లో తెగ వైరల్ అవుతోంది. ఆస్ట్రేలియాలో తన ఒక రోజు జీతం.. భారత్‌లో నెలవారీ సంపాదనకు సమానమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సుదీర్ఘ పని గంటల గురించి మాట్లాడారు. ప్రస్తుతం ఇవి నెట్టింట తీవ్ర చర్చకు దారితీశాయి. భారతీయ మూలాలున్న రవీందర్ ప్రస్తుతం ఆస్ట్రేలియాలో నివసిస్తున్నారు. ఆయన ఇన్‌స్టాగ్రామ్‌లో ఇటీవల ఓ పోస్టు పెట్టారు. అందులో ఆయన మాట్లాడుతూ.. ఉదయం 7 గంటలకు తాను వర్క్ మొదలుపెడితే.. పూర్తయ్యేసరికి అర్ధరాత్రి అవుతుందన్నారు.



అయినా, తన శరీరం అలసిపోదన్నారు. రోజుకు 650-700 ఆస్ట్రేలియా డాలర్లు (భారత కరెన్సీలో దాదాపు రూ.46వేలు) సంపాదిస్తానని వివరించారు. భారత్ లో ఒక నెలంతా పనిచేసి తాను ఒకప్పుడు సంపాదించే మొత్తాన్ని.. ఇప్పుడు ఒక్క రోజులోనే సంపాదిస్తున్నానని తెలిపారు. ఈ ఒక్కరోజు జీతంతో తన ఇంటి కోసం నెల రోజులకు సరిపడా నిత్యావసర సరకులు కొనగలనని వివరించారు. ఈ సందర్భంగా భారత్ నుంచి బయటకు వచ్చి.. అవకాశాలు అన్వేషించాలని ఆయన యువతకు పిలుపునిచ్చారు. విదేశాల్లో కష్టపడి పనిచేసి.. ఆర్థిక పరిస్థితిని మెరుగుపరుచుకోవాలని కోరారు. రవీందర్ వ్యాఖ్యలపై నెటిజన్లు విభిన్నంగా స్పందిస్తున్నారు. కొందరు ఆయన్ను సమర్థిస్తూ కామెంట్‌లు పెడుతుండగా.. మరికొందరు విదేశాల్లోని సవాళ్లను ప్రస్తావిస్తున్నారు. 'విదేశాల్లో ఆదాయం ఎక్కువే కన్పిస్తుంది. కానీ, ఖర్చులు, పన్నులు కూడా అధికంగానే ఉంటాయి' అని ఓ నెటిజన్ కామెంట్ చేశారు. 'ప్రతిఒక్కరి ప్రయాణం భిన్నంగా ఉంటుంది. అందరూ ఈ జీవనశైలిని అలవాటు చేసుకోలేరు' అని మరో నెటిజన్ రాసుకొచ్చారు.

## భారత్, పాక్ పోటాపోటీగా ఆయుధ పరీక్షలు: నోటమ్‌లు జారీ

న్యూఢిల్లీ/ఇస్లామాబాద్: క్షిపణుల ప్రయోగాలు చేపట్టనున్న నేపథ్యంలో భారత్‌పాకిస్థాన్‌లు ఒకేసారి నోటమ్‌లు జారీ చేశాయి. ఈ క్రమంలో అరేబియా సముద్రంలో పోటాపోటీగా ఇరుదేశాలు క్షిపణుల విన్యాసాలు జరపనున్నట్లు తెలుస్తోంది. ఏప్రిల్ 20, తెల్లవారుజామున 3:00 గంటల నుంచి ఏప్రిల్ 21 మధ్యాహ్నం 3:00 గంటల వరకు పౌర విమానాలు, నౌకలు దూరంగా ఉండాలని పాకిస్థాన్ నోటమ్ జారీ చేసింది. అలాగే భారత్ కూడా ఏప్రిల్ 22న ఉదయం 9:30 నుంచి ఏప్రిల్ 25న రాత్రి 9:30 గంటల వరకు సుదీర్ఘ కాలానికి ఈ హెచ్చరికలు జారీ చేసింది. సముద్రంపై సైనిక విన్యాసాల సమయంలో నిర్దేశించిన జోన్‌లకు పౌర విమానాలు, నౌకలు దూరంగా ఉండాలని 'నోటీసెస్ టు ఎయిర్‌మెన్' , 'మారిటైమ్ అడ్వైజరీస్' లాంటి హెచ్చరికలు జారీ చేయడం దేశాల మధ్య సాధారణంగా జరుగుతూనే ఉంటుంది. అయితే ఇరుదేశాలు ఒకేసారి ఈ నోటమ్‌లు ప్రకటించడం విశేషం. పాక్ 200 కిలోమీటర్ల మేర ఈ జోన్‌ను ప్రకటించగా, దానికి రెట్టింపుగా భారత్ 400 కిలోమీటర్ల క్షిపణుల విన్యాసం కోసం జోన్‌ను ప్రకటించింది. అయితే సరిహద్దు దేశాలు తరచూ ఇలాంటి క్షిపణుల ప్రయోగాలు నిర్వహిస్తూనే




ఉంటాయి. ఆపరేషన్ సిందూర్ జరిగిన ఏడాది తర్వాత ఈ ఆయుధ పరీక్షలపై ప్రకటనలు వెలువడడం గమనార్హం.

## రూ.215 కోట్ల ఈడీ కేసులో ట్విస్ట్.. అప్రూవర్‌గా మారతానన్న నటి జాక్వెలిన్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 17: ఆర్థిక నేరగాడు సుకేశ్ చంద్రశేఖర్‌కు సంబంధించిన రూ.215 కోట్ల మనీలాండరింగ్ కేసు కీలక మలుపు తిరిగింది. ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటోన్న బాలీవుడ్ నటి జాక్వెలిన్ ఫెర్నాండెజ్ అప్రూవర్‌గా మారేందుకు సిద్ధమయ్యారు. ఇందుకు అనుమతివ్వాలంటూ దిల్లీ కోర్టును అభ్యర్థించారు. అయితే, ఇందుకోసం ముందుగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ను సంప్రదించాలని నటికి న్యాయస్థానం సూచించింది. నిబంధనల ప్రకారం.. ఇలాంటి కేసుల్లో అప్రూవర్‌గా మారాలంటే ముందుగా దర్యాప్తు సంస్థను అభ్యర్థించాల్సి ఉంటుంది. ఆమె వాంగ్మూలాన్ని రికార్డ్ చేసిన అనంతరం.. సాక్షిగా మారేందుకు కోర్టులో దరఖాస్తు చేయాలా, వద్దా అనేదాన్ని దర్యాప్తు సంస్థ నిర్ణయిస్తుంది. ఈ మనీలాండరింగ్ వ్యవహారానికి సంబంధించి తనపై ఈడీ కేసు కొట్టేయాలంటూ జాక్వెలిన్ వేసిన పిటిషన్‌ను గతేడాది సుప్రీంకోర్టు కొట్టేసిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే తాజాగా ఆమె అప్రూవర్‌గా మారేందుకు సిద్ధమవడం ప్రాధాన్యం సంతరించుకుంది.

**కేసు నేపథ్యం ఇదీ..**

ఆర్థిక నేరగాడు సుకేశ్ చంద్రశేఖర్ ప్రధాన నిందితుడిగా ఉన్న రూ.215 కోట్ల దోపిడీ కేసు లో జాక్వెలిన్‌ను ఈడీ నిందితురాలిగా పరిగణించిన సంగతి తెలిసిందే. దోపిడీ చేసిన డబ్బు నుంచి నటి లబ్ధి పొందినట్లు దర్యాప్తులో గుర్తించామని ఈడీ వర్గాలు గతంలో వెల్లడించాయి. సుకేశ్ దోపిడీదారు అని జాక్వెలిన్‌కు ముందే తెలుసని, అయినప్పటికీ అతడితో సాన్నిహిత్యాన్ని కొనసాగించారని సదరు వర్గాలు పేర్కొన్నాయి. ఈ క్రమంలో వీరిద్దరూ కలిసి ఉన్న ఫొటోలు



అప్పట్లో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. ఇక, సుకేశ్ నుంచి జాక్వెలిన్ ఖరీదైన బహుమతులు అందుకున్నట్లు గతంలో వార్తలు వచ్చాయి. అత్యంత ఖరీదైన డిజైనర్ బ్యాగులు, జిమ్ సూట్లు, వజ్రాల చెవిపోగులు, బ్రాస్‌లెట్, మినీ కూపర్.. ఇలా దాదాపు రూ.10 కోట్ల విలువైన కానుకలను జాక్వెలిన్, ఆమె కుటుంబసభ్యులకు సుకేశ్ ఇచ్చినట్లు ఈడీ దర్యాప్తులో గుర్తించింది. కాగా.. ఈ ఆరోపణలను పలుమార్లు ఖండించిన నటి.. తనపై నమోదైన ఈడీ కేసును కొట్టేయాలంటూ తొలుత దిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. దీనికి ఉన్నత న్యాయస్థానం తిరస్కరించడంతో సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీన్ని పరిశీలించిన అత్యున్నత న్యాయస్థానం.. దిల్లీ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలపై జోక్యం చేసుకోవడానికి నిరాకరించింది. ఇదిలాఉండగా.. జాక్వెలిన్ తన ప్రేయసి అని సుకేశ్ పేర్కొంటున్న సంగతి తెలిసిందే. ఆమె పుట్టిన రోజు, ప్రత్యేక సందర్భాల్లో జైలు నుంచే అతడు నటికి ప్రేమ సందేశాలు పంపించడం గమనార్హం.

## హర్మూజ్‌పై ఇరాన్ కీలక ప్రకటన.. నౌకల రాకపోకలకు లైన్‌క్లియర్

పశ్చిమాసియాలో కీలక పరిణామం చోటుచేసుకుంది. హర్మూజ్ జలసంధిని పూర్తిగా తెరిచినట్లు ఇరాన్ ప్రకటించింది. అన్ని వాణిజ్య నౌకల రాకపోకలకు అనుమతించనున్నట్లు ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ వెల్లడించారు. లెబనాన్‌తో ఇజ్రాయెల్ కాల్పుల విరమణ ఒప్పందం కుదుర్చుకున్న నేపథ్యంలో ఇరాన్ నుంచి ఈ ప్రకటన వెలువడింది. కాల్పుల విరమణ ఒప్పందం అమల్లో ఉన్నంత వరకు హర్మూజ్ జలసంధి తెరిచే ఉంటుందని పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఇజ్రాయెల్‌లెబనాన్ మధ్య 10 రోజుల కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిన సంగతి తెలిసిందే. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గురువారం ఈ విషయాన్ని స్వయంగా ప్రకటించారు. అమెరికాఇరాన్ మధ్య శాశ్వత శాంతి ఒప్పందం కుదిరేందుకు లెబనాన్ ఇజ్రాయెల్ కాల్పుల విరమణ అంగీకారం అంశం




దోహదపడే అవకాశాలు ఉన్నాయి. మరోవైపు హర్మూజ్ జలసంధిని పూర్తిగా తెరుస్తున్నట్లు ఇరాన్ ప్రకటించిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కూడా తన ట్రూత్ సోషల్ ఖాతాలో పేర్కొన్నారు. దీంతో పూర్తిస్థాయిలో నౌకల రాకపోకలు కొనసాగనున్నాయని తెలిపారు. ఇరాన్‌కు ధన్యవాదాలు చెప్పారు.

**పడిపోయిన ముడిచమురు ధరలు**

ఇరాన్ ప్రకటనతో అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు ఒక్కసారిగా పతనం అయ్యాయి. బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 8 శాతం మేర క్షీణించి 90 డాలర్లకు చేరింది. డబ్ల్యూటీఐ మే నెల కాంట్రాక్ట్ 9.8 శాతం క్షీణించి బ్యారెల్ ధర 85 డాలర్లకు చేరువైంది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో ఇటీవల కాలంలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 100 డాలర్లు పైనే ట్రేడవుతూ వచ్చింది. క్రూడాయిల్ తగ్గుముఖం పట్టడం వల్ల దిగుమతులపై ఆధారపడే భారత్ వంటి దేశాలకు మేలు చేకూరుతుంది. ఇరాన్ ప్రకటనతో అమెరికా స్టాక్ మార్కెట్ దూసుకెళ్తోంది. డౌజోన్స్ ఇండస్ట్రియల్ యావరేజ్ సూచీ 1 శాతం పెరగ్గా.. ఎస్‌అండ్‌పీ 500 సూచీ 0.7 శాతం పుంజుకొంది. నాస్‌డాక్ కాంపోజిట్ ఒక శాతం మేర లాభపడింది. భారత్ స్టాక్ మార్కెట్‌ను ప్రతిఫలించే గిఫ్ట్ నిఫ్టీ (ఫ్యూచర్స్) సైతం దాదాపు 300 పాయింట్లు మేర లాభంతో 24,700 పాయింట్ల ఎగువన ట్రేడవుతోంది.

## రాజ్యాంగ సవరణ బిల్లు.. ఎన్డీఏకు ఆ బలముందా?

దిల్లీ: కేంద్రం తీసుకొచ్చిన రాజ్యాంగ సవరణ, డీలిమిటేషన్, యూటీ చట్టాల సవరణ బిల్లులపై మరికాసేపట్లో లోక్‌సభలో ఓటింగ్ జరగనుంది. రాజ్యాంగ సవరణ బిల్లుకు మూడింట రెండొంతుల మెజారిటీ అవసరం. లోక్‌సభలో మొత్తం సభ్యుల సంఖ్య 540. అంటే బిల్లు ఆమోదం పొందాలంటే కనీసం 360 మంది మద్దతు కావాలి. అధికార ఎన్డీఏ కూటమికి 292 మంది సభ్యుల మద్దతు ఉంది. అందువల్ల మరో 68 మంది మద్దతు అవసరం. మరోవైపు విపక్షాల బలం 233. వీరు కాకుండా స్వతంత్రులు, తటస్థ పార్టీలకు చెందిన వారు కలిసి 15 మంది ఉన్నారు. ప్రతిపక్ష సభ్యులు ఎక్కువ మంది గైర్హాజరైతే బిల్లు గట్టెక్కే అవకాశం ఉంది. సాయంత్రం 6 గంటలకు లోక్‌సభలో హోం మంత్రి అమిత్‌షా ప్రసంగిస్తారు. అనంతరం ఈ బిల్లులపై ఓటింగ్ జరగనుంది.

## ఆసియాలో అత్యంత ధనవంతుడిగా గౌతమ్ అదానీ..



**న్యూఢిల్లీ:** ఆసియాలోనే అత్యంత ధనవంతుడిగా నిలిచారు ప్రముఖ వ్యాపారవేత్త గౌతమ్ అదానీ. అంతేకాదు.. మరో భారతీయ వ్యాపారవేత్త ముకేష్ అంబానీని దాటి ఆయన ఈ స్థానం సంపాదించారు. ప్రపంచంలోనే అత్యంత ధనవంతులైన టాప్ 20 జాబితాను బ్లూమ్‌బర్గ్ బిలియనీర్స్ ఇండెక్స్ సంస్థ విడుదల చేసింది. ఈ 20 మందిలో ఇండియా నుంచి ఇద్దరు ఉన్నారు. అది గౌతమ్ అదానీ, ముకేష్ అంబానీ. మిగతా వారిలో ఫ్రాన్స్ నుంచి ఒకరు, స్పెయిన్ నుంచి మరొకరు, మెక్సికో నుంచి ఇంకొకరు ఉన్నారు.

ఈ ఐదుగురు మినహా టాప్ 20లో మిగతా 15 మంది అమెరికన్లే ఉండటం విశేషం. ఎప్పట్లాగే ప్రపంచంలోనే అత్యంత ధనవంతుడిగా ఎక్స్, స్పేస్ ఎక్స్, టెస్లా సంస్థల అధినేత ఎలాన్ మస్క్ నిలిచారు. ఈ జాబితాలో గౌతమ్ అదానీ 19వ స్థానంలో, అంబానీ 20వ స్థానంలో ఉన్నారు. అంబానీ సంపద విలువ 92.6 బిలియన్ డాలర్లు. ఆయన సంపద 8.10 బిలియన్ డాలర్లు పెరిగింది. ఆ తర్వాత స్థానంలో 90.8 బిలియన్ డాలర్లతో అంబానీ నిలిచారు. ఆయన సంపద 16.9 బిలియన్ డాలర్లు తగ్గింది. వారెన్ బఫెట్, బిల్‌గేట్స్, లారి ఎల్లిసన్‌ల ఆదాయం తగ్గి, స్థానాలు దిగజారారు. టాప్ 20 జాబితా ఇది.

ఎలాన్ మస్క్ (626 బిలియన్ డాలర్లు), లారీ పేజ్ (286 బిలియన్ డాలర్లు), జెఫ్ బెజోస్ (269 బిలియన్ డాలర్లు), సెర్గీ బ్రిన్ (266 బిలియన్ డాలర్లు), మార్క్ జుకర్ బర్గ్ ( 239 బిలియన్ డాలర్లు), లారీ ఎల్లిసన్ ( 230 బిలియన్ డాలర్లు), మైకేల్ డెల్ ( 170 బిలియన్ డాలర్లు), జెన్సన్ హాంగ్ ( 164 బిలియన్ డాలర్లు), బెర్నార్డ్ ఆర్నాల్ట్ ( 164 బిలియన్ డాలర్లు), జిమ్ వాల్టన్ ( 150 బిలియన్ డాలర్లు), స్టీవ్ బాల్మర్ ( 148 బిలియన్ డాలర్లు), రాబ్ వాల్టన్ ( 147 బిలియన్ డాలర్లు), అలైస్ వాల్టన్ ( 146 బిలియన్ డాలర్లు), వారెన్ బఫెట్ ( 142 బిలియన్ డాలర్లు), కార్లోస్ స్లిమ్ ( 130 బిలియన్ డాలర్లు), అమాన్సియో ఓర్టెగా ( 130 బిలియన్ డాలర్లు), బిల్ గేట్స్ ( 104 బిలియన్ డాలర్లు), థామస్ పీటర్‌ఫై ( 93.8 బిలియన్ డాలర్లు), గౌతమ్ అదానీ ( 92.6 బిలియన్ డాలర్లు), ముఖేష్ అంబానీ ( 90.8 బిలియన్ డాలర్లు).

## బంగారం దిగుమతులపై కేంద్రం కీలక నిర్ణయం..

**15 బ్యాంకులకు అనుమతి**

**బంగారం, వెండి దిగుమతికి 15 బ్యాంకులకు కేంద్రం అనుమతి**

**2026 ఏప్రిల్ 1 నుంచి 2029 మార్చి 31 వరకు అమల్లో ఉండేలా ఉత్తర్వులు**

**దిగుమతుల్లో పారదర్శకత పెంచడమే లక్ష్యమని ప్రభుత్వం వెల్లడి**

**మార్చిలో 9 నెలల కనిష్ఠానికి పడిపోయిన బంగారం దిగుమతులు**

**భారత్‌లో గోల్డ్ ఈటీఎఫ్‌లు, డిజిటల్ గోల్డ్‌కు పెరుగుతున్న ఆదరణ**




**న్యూఢిల్లీ:** బంగారం, వెండి దిగుమతుల విషయంలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. దేశంలోని 15 ప్రధాన బ్యాంకులకు పసిడి, వెండిని దిగుమతి చేసుకునేందుకు అనుమతి ఇచ్చింది. ఈ మేరకు డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ (డీజీఎఫ్‌టీ) శుక్రవారం ఒక నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ అనుమతులు 2026 ఏప్రిల్ 1 నుంచి 2029 మార్చి 31 వరకు మూడేళ్ల పాటు అమల్లో ఉంటాయి. బులియన్ దిగుమతులను క్రమబద్ధీకరించడం, నియంత్రిత మార్గాల ద్వారా వాటిని ట్రాక్ చేయడం ఈ నిర్ణయం వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశం. దీని ద్వారా పారదర్శకతను పెంచడంతో పాటు, బంగారం, వెండి వ్యాపారంలో జరిగే అక్రమాలకు అడ్డుకట్ట వేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) నుంచి అధికారం పొందిన ఈ బ్యాంకుల్లో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ), హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ ఇండియా, పంజాబ్ నేషనల్ బ్యాంక్, కోటక్ మహీంద్రా బ్యాంక్, యెస్ బ్యాంక్ వంటి దిగ్గజ ప్రైవేట్, ప్రభుత్వ రంగ బ్యాంకులు ఉన్నాయి. అయితే, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, స్బేర్‌బ్యాంక్‌లకు మాత్రం కేవలం బంగారం దిగుమతికి మాత్రమే అనుమతి లభించింది.

ఈ నేపథ్యంలో, దేశంలో బంగారం మార్కెట్ సరళిపై ప్రపంచ స్వర్ణ మండలి (వరల్డ్ గోల్డ్ కౌన్సిల్) విడుదల చేసిన నివేదిక ఆసక్తికర విషయాలను వెల్లడించింది. దీని ప్రకారం, 2026 మార్చి నెలలో భారత్ బంగారం దిగుమతులు భారీగా తగ్గి 9 నెలల కనిష్ఠ స్థాయికి చేరాయి. ఆ నెలలో కేవలం 3.1 బిలియన్ డాలర్ల విలువైన పసిడి మాత్రమే దిగుమతి అయింది. పరిమాణం పరంగా చూస్తే ఇది 20-25 టన్నులు మాత్రమే. సాధారణంగా 12 నెలల సగటు దిగుమతి 62 టన్నులుగా ఉండగా, అందులో ఇది చాలా తక్కువ. మధ్యప్రాచ్యం నుంచి విమాన రాకపోకలకు అంతరాయాలు కలగడం, డిమాండ్ తగ్గడం వంటివి ఇందుకు కారణాలని నివేదిక పేర్కొంది.

## అంతర్జాతీయ పరిణామాలతో మార్కెట్ల జోరు...

**లాభాల్లో ముగిసిన సూచీలు**

**అమెరికా-ఇరాన్ చర్చల నేపథ్యంలో ఇన్వెస్టర్లలో ఆశావహ దృక్పథం**

**ప్రధాన సూచీలను మించి రాణించిన మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్**

**నష్టాలతో ముగిసిన ఐటీ రంగం షేర్లు**




**ముంబై:** వారాంతంలో అమెరికా, ఇరాన్ మధ్య జరగనున్న చర్చలపై ఇన్వెస్టర్లు ఆశావహ దృక్పథంతో ఉండటంతో భారత ఈక్విటీ మార్కెట్లు శుక్రవారం లాభాలతో ముగిశాయి. అంతర్జాతీయంగా ఉద్రిక్తతలు తగ్గుముఖం పడతాయన్న అంచనాలతో కొనుగోళ్ల వైపు మొగ్గు చూపారు. ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 504.86 పాయింట్లు లాభపడి 78,493.54 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 156.80 పాయింట్లు పెరిగి 24,353.55 వద్ద నిలిచింది.

ట్రేడింగ్‌లో హిందుస్థాన్ యూనిలీవర్, నెస్లే ఇండియా, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, పవర్ గ్రిడ్ కార్పొరేషన్ వంటి షేర్లు రాణించి మార్కెట్లకు మద్దతునిచ్చాయి. రంగాల వారీగా చూస్తే ఎఫ్ఎంసీజీ, ఆయిల్ అండ్ గ్యాస్, మీడియా సూచీలు మంచి లాభాలు సాధించగా, ఐటీ రంగం షేర్లు మాత్రం నష్టాలతో ముగిశాయి. ప్రధాన సూచీలతో పోలిస్తే మిడ్‌క్యాప్ 1.27 శాతం, స్మాల్‌క్యాప్ 1.48 శాతం మేర లాభపడి మెరుగైన పనితీరు కనబరిచాయి.



# గిల్ కెప్టెన్ ఇన్నింగ్స్... ఉత్కంఠ పోరులో కోల్‌కతాపై గుజరాత్ విక్టరీ

**ఐపీఎల్‌లో కోల్‌కతాపై 5 వికెట్ల తేడాతో గుజరాత్ గెలుపు**

**కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (86) అద్భుత ఇన్నింగ్స్‌తో టైటాన్స్ విజయం**

**లక్ష్యఛేదనలో తడబడ్డా చివరి ఓవర్లో గట్టెక్కిన గుజరాత్**

**కామెరూన్ గ్రీన్ (79) ఒంటరి పోరాటం వృథా**

**బౌలింగ్‌లో 3 వికెట్లతో మెరిసిన కగిసో రబాడ**




**కోల్‌కతా:** ఐపీఎల్ 2026లో భాగంగా కోల్‌కతా నైట్ రైడర్స్‌తో జరిగిన ఉత్కంఠ పోరులో గుజరాత్ టైటాన్స్ 5 వికెట్ల తేడాతో విజయం సాధించింది. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (86; 50 బంతుల్లో 8 ఫోర్లు, 4 సిక్సర్లు) ఆడిన అద్భుతమైన ఇన్నింగ్స్ గుజరాత్ విజయంలో కీలకపాత్ర పోషించింది. 181 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన గుజరాత్, మరో రెండు బంతులు మిగిలి ఉండగానే 19.4 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది.

లక్ష్య ఛేదనలో గుజరాత్ టైటాన్స్‌కు మంచి ఆరంభం లభించింది. కెప్టెన్ గిల్ ఆరంభం నుంచే దూకుడుగా ఆడాడు. సాయి సుదర్శన్ (22), జోస్ బట్లర్ (25) వేగంగా పరుగులు సాధించి ఔటయ్యారు. ఆ తర్వాత గిల్ బాధ్యతాయుతంగా ఆడి జట్టును విజయానికి చేరువ చేశాడు. గిల్ ఔటైన తర్వాత కాస్త ఉత్కంఠ నెలకొన్నప్పటికీ, రాహుల్ తెవాటియా, షారుఖ్ ఖాన్ మిగిలిన లాంఛనాన్ని పూర్తి చేసి జట్టుకు విజయాన్ని అందించారు. కోల్‌కతా బౌలర్లలో వరుణ్ చక్రవర్తి రెండు వికెట్లు తీశాడు.

అంతకుముందు, టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన కోల్‌కతా, కామెరూన్ గ్రీన్ (79 పరుగులు; 55 బంతుల్లో 7 ఫోర్లు, 4 సిక్సర్లు) ఒంటరి పోరాటంతో నిర్ణీత 20 ఓవర్లలో 180 పరుగులకు ఆలౌట్ అయింది. కెప్టెన్ రహానే డకౌట్ కాగా, ఇతర బ్యాటర్లు విఫలమయ్యారు. రోవ్‌మన్ పావెల్ (27), రమణ్ దీప్ సింగ్ (17) కాసేపు గ్రీన్‌కు సహకరించారు. గుజరాత్ బౌలర్లలో కగిసో రబాడ 3 వికెట్లతో సత్తా చాటగా, మహమ్మద్ సిరాజ్ పొదుపుగా బౌలింగ్ చేసి 2 వికెట్లు పడగొట్టాడు

## డగౌట్‌లో ఫోన్.. రాజస్థాన్ మేనేజర్‌కు లక్ష జరిమానా..!



**న్యూఢిల్లీ:** ఐపీఎల్ ఫ్రాంచైజీ రాజస్థాన్ రాయల్స్ మేనేజర్ రోమి భిందర్‌కు భారీ ఊరట లభించింది. ఐపీఎల్ కోడ్ ఉల్లంఘనకు పాల్పడిన అతడిపై బీసీసీఐ అవినీతి నిరోధక శాఖ జాలి చూపించింది. డగౌట్‌లో ఫోన్ ఉపయోగించిన అతడికి భారీ ఫైన్ విధించడంతో పాటుమరోసారి అలాంటి తప్పు చేయకూడదని రోమిని హెచ్చరించింది. కోడ్ ఉల్లంఘించినందుకు రోమికి రూ.1 లక్ష జరిమానా విధించామని శుక్రవారం బీసీసీఐ సెక్రటరీ దేవజిత్ సైకియా వెల్లడించాడు.

గువాహటిలో ఏప్రిల్ 10న రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, రాజస్థాన్ రాయల్స్ తలపడ్డాయి. మ్యాచ్ సమయంలో జట్టు సభ్యులు, కోచింగ్ సిబ్బందితో కలిసి డగౌట్ కూర్చున్న రాజస్థాన్ మేనేజర్ రోమి భిందెర్ ఫోన్ చూస్తూ కనిపించాడు. దాంతో, ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న రిఫరీ అతడిపై ఫిర్యాదు చేశాడు. అయితే.. తాను ఆరోజు మ్యాచ్ వేళ ఎందుకు ఫోన్ ఉపయోగించాల్సి వచ్చింది? అనేది అవినీతి నిరోధక శాఖకు రోమి వివరించాడు.

కానీ, అతడి వివరణతో పూర్తిగా సంతృప్తి చెందని అవినీతి నిరోధక విభాగం.. అతడిపై క్రమశిక్షణ చర్యలకు ఆదేశించింది. ఈ చర్యల్లో భాగంగానే రోమికి రూ.1 లక్ష జరిమానా పడిందని బీసీసీఐ సెక్రటరీ దేవజిత్ సైకియా తెలిపాడు. మొదటి తప్పిదం కాబట్టి.. ఈసారి జరిమానాతో సరిపెట్టామని, మరోసారి నియమావళిని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రోమిని అవినీతి నిరోధక శాఖ హెచ్చరించింది. దాంతో, హమ్మయ్య బతికిపోయాను' అని రాజస్థాన్ మేనేజర్ ఊపిరి పీల్చుకున్నాడు.

ప్రఫుల్, షకీబ్ దెబ్బకు ఐపీఎల్ -19లో వైభవ్ సూర్యవంశీ మెరుపులతో వరసగా నాలుగు విజయాలు సాధించిన రాజస్థాన్ రాయల్స్ హైదరాబాద్‌లో మాత్రం తడబడింది. ఉప్పల్ స్టేడియంలో సన్‌రైజర్స్ హైదరాబాద్ కొత్త కుర్రాళ్లు ప్రఫుల్ హింగే, షకీబ్ హుస్సేన్‌లు తలా నాలుగేసి వికెట్లతో చెలరేగగా ఆ జట్టుకు తొలి ఓటమికి ఎదురైంది. ఆరెంజ్ ఆర్మీ నిర్దేశించిన 217 పరుగుల ఛేదనలో రాజస్థాన్ 159కే కుప్పకూలింది.

## పాండ్యాలో ఆ లక్షణాలు లేవు.. హిట్‌మ్యాన్‌కే మళ్లీ కెప్టెన్సీ ఇవ్వాలి..!



**న్యూఢిల్లీ:** ప్రతి సీజన్‌లో పంజా విసిరే ముంబై ఇండియన్స్ గత రెండు సీజన్లుగా తేలిపోతోంది. పంతొమ్మిదో ఎడిషన్‌ను విజయంతో ఆరంభించినా వరసగా మూడు ఓటములతో ముంబై వెనకబడింది. సొంత మైదానమైన వాంఖడేలోనూ ముంబై పాచిక పారలేదు. లీగ్ దశలో తడబాటులో ప్లే ఆఫ్స్ అవకాశాలు సన్నగిల్లుతున్న వేళ కెప్టెన్సీ మార్పు అనివార్యమని మాజీ క్రికెటర్ మనోజ్ తివారీ అంటున్నాడు. ఐదుసార్లు ఛాంపియన్ మళ్లీ మునపటి జోరందుకోవాలంటే రోహిత్ శర్మకు తిరిగి సారథ్యం అప్పగించాలని తివారీ అభిప్రాయపడ్డాడు.

ఐపీఎల్ చరిత్రలో ముంబై ఇండియన్స్ హవానే వేరు. ఏకంగా ఐదుసార్లు టైటిల్ విజేతగా నిలిచిన ముంబై ఈమధ్య కాలంలో తడబడుతోంది. టీ20 సారథిగా మెప్పించిన హార్దిక్ పాండ్యా సారథ్యంలో ఆ జట్టు పేలవమైన ఆటతో నిరాశపరుస్తోంది. పంతొమ్మిదో సీజన్‌లో ఈ మేటి జట్టు ఒకేఒక విజయంతో ప్లే ఆఫ్స్ రేసులో ఆమడ దూరంలో ఉంది. వాంఖడేలో పంజాబ్ కింగ్స్ చేతిలో 7 వికెట్ల తేడాతో హార్దిక్ పాండ్యా బృందం ఓటమిని అభిమానులే కాదు ఫ్రాంచైజీ జీర్ణించుకోలేకపోతోంది. ఈ నేపథ్యంలో కెప్టెన్సీ మార్పుతోనే ముంబై మళ్లీ విజయాల తోవ తొక్కుతుందని మనోజ్ తివారీ అంటున్నాడు. క్రిక్‌బజ్‌తో మాట్లాడిన తివారీ.. మళ్లీ రోహిత్‌ను కెప్టెన్ చేయాలని సూచించాడు.

'యాజమాన్యం ఎక్కడి నుంచి వస్తుంది? ప్రతి ఒక్కరు తమను తాము ఆత్మపరిశీలన చేసుకోవాలి. మీరు ఎలా ఆడుతున్నారు? అనేది గమనించాలి. ఈ ఒక్క ఏడాది మీరు బాగా ఆడడం లేదంటే ఈ తప్పు ఈసారి జరిగిందని కాదు. మీ మూలాలను కూడా తెలుసుకోవాల్సి ఉంటుంది. 2015 నుంచి 2023 వరకూ రోహిత్ సారథ్యంలో ముంబై ఐదుసార్లు ట్రోఫీని ఒడిసిపట్టింది. ఒక కెప్టెన్సీ విషయానికొస్తే.. శ్రేయస్ అయ్యర్ అద్భుతం. అదే ముంబై నాయకుడు మాత్రం వ్యూహాలు పన్నడంలో చాలా బలహీనంగా కనిపిస్తున్నాడు. ఈ సమస్యకు పరిష్కారం ఏంటంటే పాండ్యాను కెప్టెన్సీ నుంచి తప్పించాలి. మళ్లీ రోహిత్‌కే ముంబై పగ్గాలు అప్పగించాలి. ముంబై యాజమాన్యం రోహిత్‌ను సారథిగా తప్పించి అతడికి అన్యాయం చేసింది' అని మనోజ్ తివారీ పేర్కొన్నాడు.

# ఐపీఎల్‌లో టీ20 సంచలనం..

**ముంబై పేసర్‌ను పట్టేసిన చెన్నై..!**

**ముంబై:** ఐపీఎల్ పంతొమ్మిదో సీజన్‌లో గాయాల బారిన ఆటగాళ్ల స్థానంలో కొత్తవాళ్లు అవకాశాలు దక్కించుకుంటున్నారు. ఇప్పటికే ముంబై ఇండియన్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్ తమ స్క్వాడ్‌లో మార్పులు చేయగా.. గుజరాత్ టైటాన్స్ సైతం కొత్త కుర్రాడిని తీసుకుంది. గాయపడిన టామ్ బ్యాంటన్ స్థానంలో కొన్నార్ ఎస్టెర్‌హుజెన్‌ను స్క్వాడ్‌లో చేర్చుకుంది గుజరాత్. చెన్నై సూపర్ కింగ్స్ సైతం ప్రధాన పేసర్ ఖలీల్ అహ్మద్ స్థానాన్ని ముంబై పేసర్ ఆకాశ్ మధ్వాల్‌తో భర్తీ చేసింది.

పంతొమ్మిదో సీజన్‌లో నిరాశపరుస్తున్న గుజరాత్ టైటాన్స్ ఫ్రాంచైజీ స్క్వాడ్‌లో మార్పులు చేసింది. వేలిగాయంతో బాధ పడుతున్న టామ్ బ్యాంటన్ స్థానంలో దక్షిణాఫ్రికా చిచ్చరపిడుగు కొన్నార్ ఎస్టెర్‌హుజెన్‌తో ఒప్పందం కుదుర్చుకుంది గుజరాత్. పొట్టి క్రికెట్ సంచలనంగా పేరొందిన ఈ కుర్రాడు ఇటీవల కివీస్ గడ్డపై రెచ్చిపోయాడు.

అరంగేట్రం సిరీస్‌లో ఆడిన ఐదు మ్యాచుల్లో 145.98 స్ట్రయిక్ రేటుతో 200 పరుగులు సాధించి 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' అవార్డును అందుకున్నాడు కొన్నార్. స్వదేశంలో జరిగే ఎస్ఏ20లో ఎంఐ కేప్‌టౌన్, ప్రిటోరియా క్యాపిటల్స్‌కు ఆడిన అనుభవం కొన్నార్‌కు ఉంది. దాంతో.. బ్యాంటన్ స్థానంలో దూకుడుగా ఆడగల ఈ కుర్రాడిని ర.75 లక్షల కనీస ధరకు సొంతం చేసుకుంది గుజరాత్.

**ఖలీల్ స్థానంలో మధ్వాల్**

వరసగా రెండు విజయాలతో జోరుమీదున్న చెన్నై సూపర్ కింగ్స్ స్క్వాడ్‌లోకి ఆకాశ్ మధ్వాల్ వచ్చాడు. మ్యాచ్‌లో గాయపడి టోర్నీ మొత్తానికి దూరమైన ఖలీల్ అహ్మద్ స్థానంలో ఈ కుర్రాడికి చోటు దక్కింది. కుడిచేతి వాటం పేసరైన మధ్వాల్ డెత్ ఓవర్లలో వికెట్లు తీయడంలో దిట్ట. 2023 సీజన్‌లో ముంబై ఇండియన్స్ తరఫున బరిలోకి దిగిన ఈ కుర్రాడు 8 మ్యాచుల్లో 14 వికెట్లతో సత్తా చాటాడు. ఎలిమినేటర్‌లో గుజరాత్‌పై 5/5తో అత్యుత్తమ గణాంకాలు నమోదు చేశాడీ స్పీడ్‌స్టర్.





## సంక్రాంతికి వస్తున్నాం..

# నాకెంతో ప్రత్యేకం



**టాకీస్:** విక్టరీ వెంకటేష్ హీరోగా దర్శకుడు అనిల్ రావిపూడి తెరకెక్కించిన 'సంక్రాంతికి వస్తున్నాం' చిత్రం గతేడాది ప్రేక్షకుల ముందుకు వచ్చి బ్లాక్ బస్టర్‌గా నిలిచిన విషయం తెలిసిందే. అయితే ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద రికార్డులను సృష్టించడమే కాకుండా తాజాగా ప్రతిష్టాత్మక అవార్డును కూడా సొంతం చేసుకుంది. ముంబైలో జరిగిన ఇండియన్ నేషనల్ సినీ అకాడమి అవార్డుల వేడుకలో అనిల్ రావిపూడి తెలుగు విభాగంలో 'ఉత్తమ దర్శకుడు' పురస్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన కెరీర్‌లో 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమా అత్యంత ప్రత్యేకమైనదని తెలిపాడు. కేవలం రూ.50 కోట్ల రూపాయల బడ్జెట్‌తో రూపొందిన ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా రూ.300 కోట్ల రూపాయలకు పైగా గ్రాస్ వసూళ్లను సాధించి, పెట్టిన పెట్టుబడికి ఆరు రెట్ల లాభాలను తెచ్చిపెట్టడం ఒక దర్శకుడిగా తనకు ఎంతో సంతృప్తిని ఇచ్చిందని ఆయన వెల్లడించారు. ఈ సినిమాకు కమర్షియల్ సక్సెస్‌తో పాటు విమర్శకుల ప్రశంసలు మరియు జాతీయ స్థాయి అవార్డు దక్కడం పట్ల అనిల్ రావిపూడి హర్షం వ్యక్తం చేశారు.



MOVIE TIME

## కోలీవుడ్‌లో కలకలం..

# 'జైలర్ 2' సీన్స్ లీక్!



**టాకీస్:** కోలీవుడ్‌లో వరుస లీకేజీల కలకలం చిత్ర పరిశ్రమను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. కొన్ని రోజుల క్రితమే 'జన నాయగన్' చిత్రానికి సంబంధించిన కీలక సన్నివేశాలు ఆన్‌లైన్‌లో ప్రత్యక్షం కాగా, ఇప్పుడు సూపర్ స్టార్ రజనీకాంత్ నటిస్తున్న మోస్ట్ అవేటెడ్ సీక్వెల్ 'జైలర్ 2' షూటింగ్ ఫుటేజీ కూడా బయటకు రావడం సంచలనం సృష్టిస్తోంది.

నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వంలో ప్రస్తుతం శరవేగంగా చిత్రీకరణ జరుపుకుంటున్న ఈ మూవీలోని ఒక కీలక సన్నివేశానికి సంబంధించిన వీడియో క్లిప్ సోషల్ మీడియా వేదికగా వైరల్ అవుతోంది. ఈ పరిణామంతో షాక్‌కు గురైన నిర్మాణ సంస్థ సన్ పిక్చర్స్ వెంటనే రంగంలోకి దిగింది. తమ యాంటీ పైరసీ టీమ్ నిరంతరం సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లను పర్యవేక్షిస్తోందని, లీకైన కంటెంట్‌ను షేర్ చేసినా లేదా ప్రమోట్ చేసినా అటువంటి అకౌంట్లపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోవడమే కాకుండా వాటిని శాశ్వతంగా తొలగిస్తామని హెచ్చరించింది. దాదాపు చివరి దశకు చేరుకున్న ఈ సినిమా షూటింగ్‌ను 2026 ఏప్రిల్ నాటికి పూర్తి చేసి, అదే ఏడాది జూన్ 12న ప్రపంచవ్యాప్తంగా ఘనంగా విడుదల చేసేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. రమ్యకృష్ణ, యోగి బాబుతో పాటు మోహన్‌లాల్, శివరాజ్ కుమార్ వంటి దిగ్గజ తారలు నటిస్తున్న ఈ సినిమా స్థాయిని దృష్టిలో ఉంచుకుని, అభిమానులు ఎవరూ ఇటువంటి లీకేజీలను ప్రోత్సహించవద్దని, కేవలం అధికారిక అప్‌డేట్స్‌ను మాత్రమే ఫాలో అవ్వాలని చిత్ర యూనిట్ విజ్ఞప్తి చేస్తోంది. వరుసగా స్టార్ హీరోల సినిమాల దృశ్యాలు ఇలా లీక్ అవుతుండటం ఇప్పుడు కోలీవుడ్ సర్కిల్స్‌లో హాట్ టాపిక్‌గా మారింది.


===

**టాకీస్:** కంగనా రనౌత్, చిరాగ్ పాశ్వాన్ ఆ ఇద్దరూ ఇప్పుడు ఫుల్ బిజీ అయ్యారు. పబ్లిక్ ఈవెంట్స్‌లో తరుచూ కనిపిస్తున్నారు. దీంతో కొందరు డౌట్స్ వ్యక్తం చేస్తున్నారు. ఆ ఎంపీలు ఇద్దరూ రొమాంటిక్ రిలేషన్‌లో ఉన్నారా అన్న అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఓ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఫిల్మ్ స్టార్ , ఎంపీ కంగనా రనౌత్ క్లారిటీ ఇచ్చారు. ఆ రూమర్స్‌కు ఆమె చెక్ పెట్టారు. చిరాగ్ పాశ్వాన్ కేవలం ఫ్రెండ్ మాత్రమే అని ఆమె చెప్పారు. తమ మధ్య రొమాన్స్ లేదని కంగనా పేర్కొన్నది. తమ మధ్య చాన్నాళ్ల పరియం ఉందని, పదేళ్ల క్రితం ఇద్దరం కలిసి సినిమా తీశామని, ఒకవేళ తమ మధ్య ప్రేమాయణం సాగి ఉంటే, మాకు పిల్లలు పుట్టేవారని కంగనా రనౌత్ పేర్కొన్నది. పాశ్వాన్‌తో తన రిలేషన్ చాన్నాళ్ల నుంచి అలాగే ఉందన్నారు. ఒకవేళ తనకు రొమాన్స్ కావాలనుకుంటే, అది జరిగేదని, కానీ అలాంటిది ఏమీ లేదని, అది కేవలం ఫ్రెండ్లీ పరిచయం మాత్రమే అని, అతను కూడా ఫిల్మ్ ఇండస్ట్రీ నుంచి వచ్చాడని, అందుకే తమ మధ్య పరిచయం కాస్త చనువుగా ఉంటుందని ఆమె అన్నారు. 2011లో రిలీజైన మిలే నా మిలే హమ్ చిత్రంలో కంగనా, చిరాగ్ పాశ్వాన్ కలిసి నటించారు. తన్వీర్ ఖాన్ ఆ చిత్రాన్ని డైరెక్ట్ చేశారు. ఆ తర్వాత ఇద్దరూ రాజకీయాల్లో రాణించారు. కానీ కంగనా అడపాదడపా చిత్రాల్లో నటిస్తోంది. చివరిసారి ఆమె ఎమర్జెన్సీ చిత్రంలో యాక్ట్ చేశారు.

# చిరాగ్ పాశ్వాన్‌తో ఎలాంటి రిలేషన్ లేదు

## క్లారిటీ ఇచ్చిన నటి కంగనా రనౌత్

# త్రివిక్రమ్‌తో ఎన్టీఆర్ మరో సినిమా




**టాకీస్:** ఎన్టీఆర్ వరుసగా భారీ ప్రాజెక్టులతో తన ఫ్యాన్స్‌కు ఫుల్ ట్రీట్ ఇవ్వడానికి సిద్ధమవుతున్నాడు. ఇప్పటికే స్టార్ దర్శకుడు ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో 'డ్రాగన్' అనే యాక్షన్ ఎంటర్‌టైనర్‌లో నటిస్తున్న తారక్, తన తదుపరి చిత్రాన్ని మాటల మాంత్రికుడు శ్రీనివాస్‌తో చేయనున్న విషయం తెలిసిందే. గతంలో వీరిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన అరవింద సమేత వీర రాఘవ బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని సాధించడంతో, ఈ కొత్త ప్రాజెక్ట్‌పై అంచనాలు మరింతగా పెరిగాయి. తాజా సమాచారం ప్రకారం, ఈ చిత్రం ఆధ్యాత్మికత, కమర్షియల్ ఎలిమెంట్స్ మేళవింపుతో కూడిన విభిన్న కథాంశంతో తెరకెక్కనుంది. ముఖ్యంగా కుమారస్వామి నేపథ్యం ఉండబోతుందని, విజువల్ వండర్‌గా మలచడానికి త్రివిక్రమ్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఇక ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన మరో ఆసక్తికర అంశం టైటిల్. సోషల్ మీడియాలో వినిపిస్తున్న ప్రచారం ప్రకారం, ఈ చిత్రానికి 'గాడ్ ఆఫ్ వార్' అనే పవర్‌ఫుల్ టైటిల్‌ను పరిశీలిస్తున్నారట. టైటిల్‌ను బట్టి చూస్తే, ఈసారి ఎన్టీఆర్‌ను మరింత ఉగ్రరూపంలో, శక్తివంతమైన పాత్రలో చూపించే అవకాశం ఉందని సినీ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఇదిలా ఉంటే, ఎన్టీఆర్ పుట్టినరోజు సందర్భంగా ఈ రెండు సినిమాలకు సంబంధించిన కీలక అప్‌డేట్స్ రావొచ్చని ఫిలింనగర్ వర్గాల్లో గట్టిగా వినిపిస్తోంది. ఒకే రోజు త్రివిక్రమ్ ప్రాజెక్ట్ అధికారిక ప్రకటనతో పాటు, ప్రశాంత్ నీల్ దర్శకత్వంలోని 'డ్రాగన్' నుంచి కూడా అప్డేట్ వచ్చే అవకాశం ఉందట. ఈ డబుల్ అనౌన్స్‌మెంట్స్ ఎన్టీఆర్ అభిమానులకు నిజమైన పండుగలా మారనుండడం ఖాయం. ఒకవైపు భారీ యాక్షన్ డ్రామా, మరోవైపు ఆధ్యాత్మిక బ్యాక్‌డ్రాప్‌లో విజువల్ గ్రాండియర్ ఇలా రెండు విభిన్న జానర్లలో సినిమాలు చేయడం ద్వారా తారక్ తన గ్లోబల్ ఇమేజ్‌ను మరింత బలోపేతం చేస్తున్నాడు. మొత్తంగా ఎన్టీఆర్ తన కెరీర్‌లో అత్యంత కీలక దశలో ఉన్నాడని చెప్పాలి. వరుసగా భారీ ప్రాజెక్టులు, స్టార్ డైరెక్టర్లతో కాంబినేషన్లు, విభిన్న కథలు అన్నీ కలిసి టాలీవుడ్‌లో మరో సెన్సేషన్ సృష్టించడానికి సిద్ధంగా ఉన్నాయి. ఇక ఈ సినిమాలు ప్రేక్షకులను ఎలా అలరిస్తాయో చూడాలి.

# 16 ఏళ్ల న్యాయపోరాటం..

## నటి తమన్నాకు మద్రాస్ హైకోర్టులో భారీ షాక్!

**టాకీస్:** మద్రాస్ హైకోర్టులో ప్రముఖ నటి తమన్నా భాటియాకు భారీ షాక్ తగిలింది. సుమారు 16 ఏళు _గా సాగుతున్న సుదీర్ఘ న్యాయ పోరాటంలో చివరకు ఆమెకు చుక్కెదురైంది. గతంలో 'పవర్ సోప్స్' అనే సంస్థకు బ్రాండ్ అంబాసిడర్‌గా పనిచేసిన తమన్నా, తన ఒప్పంద కాలం ముగిసిన తర్వాత కూడా ఆ సంస్థ తన ఫోటోలను ప్రకటనల్లో వాడుకుందని ఆరోపిస్తూ 2011లో కోర్టును ఆశ్రయించారు. తన అనుమతి లేకుండా ఫోటోలు వాడినందుకు గాను కోటి రూపాయల నష్టపరిహారం చెల్లించాలని ఆమె సివిల్ సూట్ దాఖలు చేశారు. అయితే ఈ కేసును విచారించిన మద్రాస్ హైకోర్టు డివిజన్ బెంచ్, తమన్నా ఆరోపణలకు తగిన సాక్ష్యాధారాలు లేవని స్పష్టం చేసింది. ఆమె సమర్పించిన సబ్బు కవర్లు, ఇతర పత్రాలు సదరు సంస్థ ఉద్దేశపూర్వకంగా ఉల్లంఘనకు పాల్పడిందని నిరూపించలేకపోయాయని కోర్టు అభిప్రాయపడింది. గతంలోనే ఒక సింగిల్ జడ్జి ఆమె పిటిషన్‌ను కొట్టివేయగా, దానిని సవాలు చేస్తూ తమన్నా అప్పీల్‌కు వెళ్లారు. తాజాగా జస్టిస్ పి. వేల్మురుగన్, జస్టిస్ కె. గోవిందరాజన్ తిలకవతిలతో కూడిన ధర్మాసనం పాత తీర్పునే సమర్థిస్తూ ఆమె అప్పీల్‌ను పూర్తిగా కొట్టివేసింది. ఈ తీర్పుతో నష్టపరిహారం రాకపోగా, ఇన్నేళ్లుగా సాగిన పోరాటం ఆమెకు నిరాశనే మిగిల్చింది. ప్రస్తుతం ఈ వార్త సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది.



Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.